# తొలివార్త

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com



Best Deal HEALTH & WEALTH

"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."

We create opportunities | 9640707117 (What's up only)



ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 140 శుక్రవారం 25 - 09 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial


## సీఎం రేవంత్‌కు 'ముహమ్మద్' అవార్డు ప్రదానం

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు రేవంత్‌రెడ్డి ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు
- రైతులు, బీసీలు, సామాన్య ప్రజల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు
- ప్రజాస్వామిక విలువలపై నిబద్ధతను కొనియాడిన జ్యూరీ
- రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేత



**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు.కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి.అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో అవార్డును ముఖ్యమంత్రి - మిగతా 2 లో

### ఎమ్మెల్యేగా

## దానం అనర్హుడే




- పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది
- ఆయనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది
- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు.



### పరువునష్టం పిటిషన్లను

## కోర్టు స్వీకరించింది

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు
- మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది
- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో - మిగతా 2 లో

## కోటీశ్వరులతో కిక్కిరిసిపోతున్న చంచల్‌గూడ జైలు!

- ఏసీబీకి చిక్కుతున్న వందల కోట్ల అవినీతి తిమింగలాలు
- ఇటీవల నిమ్స్ అధికారి సహా పలువురు అరెస్ట్
- లంచం, అక్రమాస్తుల కేసుల్లో పెరుగుతున్న అరెస్టులు

**తొలివార్త, హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ఇప్పుడు 'కోటీశ్వరుల జైలు'గా మారిపోయింది. వందల కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడబెట్టి, అవినీతికి పాల్పడి ఏసీబీకి పట్టుబడుతున్న బడా అధికారులు ఇప్పుడు ఈ జైలుకే చేరుతున్నారు. దీంతో ఒకప్పుడు సాధారణ ఖైదీలతో ఉండే - మిగతా 2 లో






### అంటార్కిటికాలో

## మంచు గణపతి

- భారత శాస్త్రవేత్తల వినూత్న చవితి వేడుక
- మైత్రి పరిశోధన కేంద్రంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు
- పర్యావరణ హితంగా బకెట్ నీటిలో విగ్రహ నిమజ్జనం
- ఈ వేడుకలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- కఠిన పరిస్థితుల్లోనూ సంప్రదాయాన్ని పాటించిన శాస్త్రవేత్తలపై ప్రశంసలు

**తొలివార్త,ఢిల్లీ, సెప్టెంబర్ 24 :** స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో, అత్యంత శీతల ఖండమైన అంటార్కిటికాలో భారత శాస్త్రవేత్తలు వినాయక చవితి పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, వినూత్నంగా జరుపుకున్నారు. అక్కడి భారత పరిశోధన కేంద్రమైన 'మైత్రి'లో పనిచేస్తున్న శాస్త్రవేత్తల బృందం, మంచుతోనే గణనాథుడి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ సంప్రదాయంపట్ల ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. - మిగతా 2 లో

### సూపర్ ఎల్‌నినోతో

## భారీ ముప్పు



- 4.51 లక్షల మంది చనిపోయే అవకాశం- భారత్‌పై ప్రభావమెంత
- సాధారణం కంటే 44 శాతం ఎక్కువ వేడి ఉండే రోజులు
- భారత్‌లో ఫిబ్రవరి వరకు 15,800 అదనపు మరణాల అంచనా
- ఎల్‌నినో కొనసాగితే భారత్‌లో వేసవిలో ముప్పు మరింత పెరిగే అవకాశం

**తొలివార్త,ఢిల్లీ, సెప్టెంబర్ 24 :** ప్రపంచానికి మరో పెద్ద ముప్పు పొంచి ఉందా ఈ ఏడాది బలంగా మారిన సూపర్ ఎల్‌నినోపై తాజా నివేదిక అదే భయాన్ని కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వచ్చే కొన్ని నెలల్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఎండలు పెరగొచ్చని, దీంతో వేడి తట్టుకోలేక లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తెలిపింది. ఈ ఏడాది జూన్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా 4.51 లక్షల మంది వేడి కారణంగా చనిపోయే అవకాశం ఉందని ఈ నివేదిక చెబుతోంది. అయితే ఇది కచ్చితమైన సంఖ్య కాదని, వాతావరణ పరిస్థితులు మారితే ఆ సంఖ్య కూడా మారొచ్చని పరిశోధకులు - మిగతా 2 లో




## వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ' ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!

### కుండపోత వర్షాలు అధికారులకు

## పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

- కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్
- వర్షాలు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన



**తొలివార్త, అమరావతి, సెప్టెంబర్ 24 :** తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, - మిగతా 2 లో



## అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

- స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు
- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్
- ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

**తొలివార్త, అమరావతి, సెప్టెంబర్ 24 :** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ - మిగతా 2 లో

### ఢిల్లీలో నారా లోకేశ్

## పెట్టుబడుల వేట



- ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం
- విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రెజ్‌లకు ప్రతిపాదనలు

**తొలివార్త, అమరావతి, సెప్టెంబర్ 24 :** ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. - మిగతా 2 లో

### ఏపీలో వర్ష బీభత్సం యంత్రాంగం

## అప్రమత్తంగా ఉండాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం
- భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మరోసారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు మరోసారి టెలికాన్ఫరెన్స్



**తొలివార్త, అమరావతి, సెప్టెంబర్ 24 :** భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మరోసారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. నీటి ఉద్ధృతితో దెబ్బతిన్న రహదారులను తక్షణమే పునరుద్ధరించాలని, కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. చెరువులు నింపడంతో పాటు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరద పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ ప్రజలకు అవసరమైన సహాయం వెంటనే అందించాలని సీఎం స్పష్టం చేశారు.వర్షాలతో వస్తున్న ప్రతి నీటి ప్రవాహాన్ని ఒడిసిపట్టి రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు, ఇతర నీటి వనరులను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సాయంత్రం - మిగతా 2 లో

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com



# సంపాదకీయం

## అజేయుడు పుతిన్!

ఎన్నికల బాదరబందీ లేకుండా, ఓటర్ల చుట్టూ ప్రదక్షిణ చేసే 'ఖర్మ' పట్టకుండా దేశాధినేతలుగా చలామణి అయ్యేవారు ప్రపంచంలో ఇప్పటికీ చాలామందే ఉన్నారు. ఆ దేశాల్లో ఇలాంటివారికి మీడియా, సామాజిక మాధ్యమాలూ భజన చేస్తున్నా... ప్రపంచంలో వేరేచోట్ల వారికి నియంతలన్న అపకీర్తి ఉంటుంది. చైనా, ఉత్తర కొరియా వంటి దేశాల్లో మార్క్సిజం పేరు చెప్పి ఈ ఏకపక్ష స్వామ్యం సాగిపోతుంటుంది. రష్యాను దీర్ఘకాలంనుంచి ఏలుతున్న అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సాధించిన అఖండ విజయం మరోసారి ఆయనదైన ముద్ర చూపింది. తన పదవికి ఎసరుపెట్టే అవకాశం ఉందని భావించిన వారెవరినీ ఆయన వదల్లేదు. ఏమాత్రం ప్రభావితం చేయలేనివారు పోటీలో ఉన్నా పట్టించుకోలేదు. ఆయన వ్యతిరేకులు అనుమానాస్పద స్థితిలో మరణించ టమో, జైళ్లకు పోవటమో రివాజు. ఈనెల 18 నుంచి 20 వరకూ రష్యా పార్లమెంటు డ్యూమాకు జరిగిన ఎన్నికల్లో ఆయనకే చెందిన 'యునైటెడ్ రష్యా' పోలైన ఓట్లలో 57.83 శాతం దక్కించుకుంది. 2021లోని 49.82 శాతంతో పోలిస్తే ఇది అధికం. 95 శాతం ఓట్ల లెక్కింపు జరిగాక బుధవారం ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రాథమిక ఫలితాలనుబట్టి దానికి 355 స్థానాలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఆ పార్టీ బలం 343. ఒకప్పుడు అవిచ్ఛిన్నంగా దేశాన్నేలిన వారసత్వంగల కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ పార్టీకి 13.8 శాతం ఓట్లు, దాదాపు 40 స్థానాలు లభిస్తాయని తేలింది. 2021లో ఆ పార్టీకి 18.93 శాతం ఓట్లు, 57 సీట్లు లభించాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక పార్టీ యాబ్లొకొ పార్టీపై అనర్హత వేటుపడింది. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించి నాలుగున్నరేళ్లు దాటడం, ఆంక్షల పర్యవసానంగా దేశ ఆర్థికవ్యవస్థ కుంగిపోవటం, ధరలు ఆకాశాన్నంటడం, ప్రత్యర్థి దేశం డ్రోన్ దాడుల పరంపరతో చమురు క్షేత్రాలు ధ్వంసం కావటంతో జనం యునైటెడ్ రష్యాను వ్యతిరేకించటం ఖాయమని కొందరు అంచనా వేశారు. రష్యా ఎదుర్కొంటున్న సంక్షోభం సామాన్యమైనది కాదు. చమురు క్షేత్రాల ధ్వంసంవల్ల ఉత్పత్తి నిలిచి, పెట్రోల్ బంకుల వద్ద వేలాది వాహనాలు బారులు తీరాయి. చివరకు తాను విక్రయించిన చమురునే మళ్లీ భారత్‌నుంచి కొనుగోలు చేయకతప్పలేదు. రష్యాలో సంక్షోభం ఏ స్థాయిలో ఉందంటే, మరిన్ని 'త్యాగాలకు' సిద్ధపడాలని కొత్త ప్రభుత్వం పౌరుల్ని కోరవచ్చంటు న్నారు. ఆరోగ్య పరిరక్షణ, విద్య వగైరా వ్యయాలను కట్టిపెట్టి యుద్ధంపైనే సర్వశక్తులూ కేంద్రీకరించాలని పుతిన్ చాన్నాళ్లుగా భావిస్తున్నారు. 'యుద్ధ ఆర్థిక వ్యవస్థ'లో సర్వం లయంకావటం సహజమే. ఎన్నికల ప్రక్రియను ఏమార్చటం రష్యాలో సాధారణమే అయినా, ఓట్లేసినవారిలో అత్యధికులు దేశభక్తి, జాతీయత వంటి వ్యామోహాల్లో పడ్డారని కొందరి వాదన. తనకు దేశంపై పూర్తి స్థాయి పట్టు ఉందని ఎన్నికలైనా, వ్యవస్థలైనా విశ్వసనీయమైనవని చూపటానికి పుతిన్ తాపత్రయ పడ్డారు. 'త్యాగాలకు' సిద్ధపడాలని పిలుపునిచ్చే ఆర్థిక దుఃస్థితి లేనేలేదని, ఇదంతా గిట్టనివాళ్ల ప్రచారమని ఎన్నికలకు ముందు ఆయన ప్రకటించారు. కానీ ఇచ్చిన మాట నిలుపుకుంటారా అన్నది చెప్పలేం. ఈ ఎన్నికలు బూటకమని, వీటిని తిరస్కరించాలని బ్రిటన్, కెనడా, నార్వే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. అయితే సార్వజనీనంగా ఆమోదించిన ప్రజాస్వామ్య నమూనా అంటూ ప్రపంచంలో ఎక్కడా లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నదని చెప్పుకుంటున్న దేశాలు ఆ పదానికి తమ తమ సొంత భాష్యాలు ఇచ్చుకుంటున్నాయి. క్రమం తప్పని ఎన్నికలు, నిర్ణీత వ్యవధిలో చట్టసభల సమావేశాలు, వాటిల్లో అధికార విపక్షాల వాగ్యుద్ధాలు, పరస్పర ఆరోపణలు.

## అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

**మొదటిపేజీ తరువాయి -** చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## కోటీశ్వరులతో కిక్కిరిసిపోతున్న చంచల్‌గూడ జైలు!

**మొదటిపేజీ తరువాయి -** ఈ జైలు, ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులున్న వారితో నిండిపోతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా, నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ ఆదాయానికి మించి రూ.100 కోట్ల ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై అరెస్ట్ అయి చంచల్‌గూడ జైలుకు చేరారు. కొన్ని రోజుల క్రితమే డీఎస్పీ భీంరెడ్డి కూడా వంద కోట్లకు పైగా అక్రమాస్తుల కేసులో ఏసీబీకి చిక్కి ఇక్కడికే వచ్చారు. వీరే కాకుండా, ల్యాండ్ అండ్ సర్వే విభాగం డిప్యూటీ డైరెక్టర్ నరహరిరావు సైతం రూ.100 కోట్లకు పైగా ఆస్తుల కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు. ఇలా పోలీసు, రెవెన్యూ, వైద్య, ఇంజనీరింగ్ వంటి పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఏసీబీ వలలో చిక్కి చంచల్‌గూడ జైలుకు చేరుతున్నారు. అవినీతి కేసుల్లో ప్రధానంగా రెండు రకాలుగా అధికారులు పట్టుబడుతున్నారు. ఒకటి, చేయాల్సిన పనికి నేరుగా లంచం డిమాండ్ చేయడం. రెండోది, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం. ఈ రెండు కేసుల్లోనూ పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఓ విచిత్రమైన ఘటనలో, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సబ్-జైలులో డిప్యూటీ జైలర్‌గా పనిచేసిన దేవేందర్, ఓ ఖైదీ నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. గంటల వ్యవధిలోనే.. అధికారిగా పనిచేసిన అదే జైలులో ఆయన ఖైదీగా మారాల్సి వచ్చింది. ఒకప్పుడు అధికారం, విలాసవంతమైన జీవితం గడిపిన ఈ అధికారులు.. ఇప్పుడు జైలు గోడల మధ్య విచారణ ఖైదీలుగా కాలం గడుపుతున్నారు.

## వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ' ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!

**మొదటిపేజీ తరువాయి -** వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## కుండపోత వర్షాలు అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి -** పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతరం దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు.

# ఏపీలో వర్ష బీభత్సం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి -** ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం వర్షాలు, నీటి ప్రవాహాలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట మొబైల్ లిఫ్టులు, మోటార్లను వినియోగించి నీటిని ఎత్తిపోసి నిల్వ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లలో పెరుగుతున్న ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయం, భూసార పెంపు, ఏఐ ఆధారిత డేటా విశ్లేషణను పైలట్‌గా అమలు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు దృష్ట్యా వరద నియంత్రణ చర్యల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహి ంచిన మంత్రి, వాతావరణ శాఖ నుంచి ముందస్తు సమా చారం తీసుకుంటూ రిజర్వాయర్లు, నదులు, వాగుల్లోకి వచ్చే నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సూచించారు. మున్నేరు ఇన్‌ఫ్లో, బుడమేరు వరద పరిస్థితిని బట్టి పట్టిసీమ పంపులను, ఏలేరు క్యాచ్‌మెంట్‌లో వర్షాలకు అనుగుణంగా పురుషోత్తపట్నం పంపులను ఆపరేట్ చేయాలని ఆదేశించారు. వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల ప్రవాహా లను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇరిగేషన్ అధికారులు వార్‌రూమ్‌ల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి వర్షాల పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు ప్రాం తాల్లో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది 24 గంటలూ అందు బాటులో ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. డ్రెయిన్లలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లపై విరిగిపడే చెట్లను వెంటనే తొలగించేందుకు అవసరమైన యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిం చాలని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖ జిల్లాలో వర్షాల పరిస్థితిపై మంత్రి వీరాంజనేయస్వామి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితి, ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యలపై అధికారులను అడిగి తెలుసు కున్నారు. ముంపు కాలనీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. వర్షాలు తగ్గే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి డోలా భరోసా ఇచ్చారు. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తు న్నందున ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 613 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నాయని వెల్లడించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 356 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రహదారులకు అధిక నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు చోట్ల భారీ కోతలు ఏర్పడి రహదారులు కొట్టుకుపోగా, 78 చోట్ల సీడీ వర్క్స్ దెబ్బతిన్నాయని, 37 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వివరిం చారు. 11 చోట్ల రహదారులపై పడిన చెట్లను తొలగించి రాకపోక లను పునరుద్ధరిం చామన్నారు. 23 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే 14 చోట్ల క్లియర్ చేశామని తెలిపారు. దెబ్బతిన్న రహదా రుల తాత్కాలిక పునరుద్ధరణకు రూ.26.95 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.224.73 కోట్లు అవసరమవుతాయని, మొత్తంగా రూ. 251.68 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్రవ్యా ప్తంగా 78 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమిం చామని, 614 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని మంత్రి తెలిపారు. రోడ్లపై పడే చెట్లు, మట్టి, కొండచరి యలను తొలగించేం దుకు 550 జేసీబీలు, 596 పవర్ సాస్‌ను సిద్ధంగా ఉంచామని, అత్యవసర సహాయక చర్యలకు సిబ్బ ంది, అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు బీసీ జనార్దన్ రెడ్డి వివరిం చారు. తుఫాను ప్రభావంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. రహదా రులపై మోకాల్లోతు నీరు నిలిచింది. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కొండ ప్రాంతంలో ఉంటున్న వారిని అప్రమత్తం చేయాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశిం చారు. దీంతో గండాలయ్యపేట, ఇతర కొండ ప్రాంతాలలో ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇంటింటా మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు.

# ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు. పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచిం చారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహి ంచేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు. గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

# సూపర్ ఎల్‌నినోతో భారీ ముప్పు

**మొదటిపేజీ తరువాయి -**

తెలిపారు. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు ఆరు నెలల్లో వేడి వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.39 లక్షల మంది మరణించే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది వేసవి వరకు కొనసాగితే ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. సాధారణ సంవత్సరాలతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడి ఉండే రోజులు 44 శాతం పెరగొచ్చని తెలిపింది. అంటే ఎండలు ఎక్కువ రోజులు మాత్రమే కాకుండా, మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నమాట. ఆ వేడి ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉంది. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు దేశంలో సుమారు 15,800 మరణాలు సంభవించే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. ఇందులో డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యే సుమారు 7,400 మంది వేడి కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని పేర్కొంది. అయితే భారత్‌లో అసలు ఎండాకాలం మార్చి తర్వాత మొదలవుతుంది. ఆ సమయంలో కూడా ఎల్‌నినో ప్రభావం కొనసాగితే వేడి వల్ల మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. వేడి కారణంగా ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉన్న దేశాల్లో నైజీరియా మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత ఇండోనేసియా, సూడాన్, భారత్, బ్రెజిల్ ఉన్నాయి. నైజీరియా- 31,400 వరకు, ఇండోనేసియా- 19,300 వరకు, సూడాన్- 17,500 వరకు, భారత్- 15,800 వరకు, బ్రెజిల్- 13,300 వరకు ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని నివేదిక తెలిపింది. నైజీరియా, సూడాన్, నైజర్, చాద్ ప్రాంతాల్లో కలిపి సుమారు 66,800 అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. సాధారణంగా పసిఫిక్ సముద్రంలో నీటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగినప్పుడు ఎల్‌నినో ఏర్పడుతుంది. దీనివల్ల ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు మారిపోతాయి. ఎక్కడో వర్షాలు తగ్గుతాయి. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు పడొచ్చు. కొన్ని ప్రాంతాల్లో ఎండలు కూడా తీవ్రంగా మారుతాయి. సముద్రం నీటి ఉష్ణోగ్రత సాధారణం కంటే చాలా ఎక్కువగా పెరిగినప్పుడు దాన్ని సూపర్ ఎల్‌నినో అంటారు. ప్రస్తుత ఎల్‌నినో చాలా బలంగా ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఎల్‌నినో సహజంగా ఏర్పడే వాతావరణ మార్పే అయినప్పటికీ, భూమి ఇప్పటికే వేడెక్కుతుండటం వల్ల దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో ఎల్‌నినో కూడా తోడైతే కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఎండలు, వర్షాభావం, అడవుల్లో మంటలు, భారీ వర్షాలు, వరదలు వంటి సమస్యలు పెరగొచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రజలకు ముందుగానే ఎండలపై హెచ్చరికలు ఇవ్వడం, చల్లగా ఉండే కేంద్రాలను ఏర్పాటు చేయడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఉపయోగప డతాయని పేర్కొంది. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, చిన్నపిల్లలు, ఎండలో పనిచేసే కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించింది. వేడి ఎక్కువగా ఉండే రోజుల్లో ఆసుపత్రుల్లో అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచడం కూడా అవసరమని తెలిపింది. ప్రస్తుత పరిశోధకులు భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణానికి ఒక ముందస్తు హెచ్చరికగా చెప్పింది. ఎండలు మరింత తీవ్రంగా మారే పరిస్థితుల్లో ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల భారీ ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది.

## అంటార్కిటికాలో మంచు గణపతి

**మొదటిపేజీ తరువాయి -** ఈ అపురూప వేడుక ఇప్పుడు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్'కు చెందిన ఈ పరిశోధకులు, గడ్డకట్టే చలిలో తమకు అందుబాటులో ఉన్న మంచును ఉపయోగించి ఒక సుందరమైన గణపతి రూపాన్ని తీర్చిదిద్దారు. ఎలాంటి అచ్చులు లేకుండా, కేవలం చేతులతోనే ఈ విగ్రహాన్ని రూపొందించడం వారి సృజనాత్మకతకు, భక్తికి నిదర్శనంగా నిలిచింది. అనంతరం హిందూ సంప్రదాయం ప్రకారం విగ్రహానికి హారతి ఇచ్చి, పూజలు చేశారు. నైవేద్యంగా మోదకాలు వంటి ప్రసాదాలను సమర్పించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ వేడుకలో అత్యంత ప్రత్యేకమైన ఘట్టం నిమజ్జనం. అంటార్కిటికాలోని సున్నితమైన, కాలుష్యరహిత పర్యావరణానికి ఎలాంటి హాని కలగకూడదనే గొప్ప ఉద్దేశంతో వారు పర్యావరణ హితమైన పద్ధతిని ఎంచుకున్నారు. బయట సహజ నీటి వనరులలో కాకుండా, పరిశోధన కేంద్రం లోపలే ఒక బకెట్‌లో నీటిని తీసుకుని, అందులో మంచు గణపతి విగ్రహాన్ని ఉంచారు. కొద్దిసేపటికే మంచు పూర్తిగా కరిగి విగ్రహం నీటిలో కలిసిపోయింది. ఈ విధంగా వారు పర్యావరణ నిబంధనలను పాటిస్తూనే తమ సాంప్రదాయాన్ని పూర్తిచేశారు. ఈ బృందంలోని డాక్టర్ అనిరుధ్ ధర్, ఈ అపురూప వేడుకలకు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. "మా ఇంటికి 15,000 కిలోమీటర్ల దూరంలో, సుస్థిరమైన పద్ధతిలో నిమజ్జనం" అంటూ ఆయన తన పోస్టుకు క్యాప్షన్ జోడించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయింది. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనూ, తమ సంస్కృతిని మరువకుండా ఇంత సృజనాత్మకంగా, భక్తితో పండుగ జరుపుకున్న శాస్త్రవేత్తల బృందంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వారి దేశభక్తిని, పర్యావరణ స్పృహను కొనియాడుతున్నారు.

## సీఎం రేవంత్‌కు 'ముహమ్మద్' అవార్డు ప్రదానం

**మొదటిపేజీ తరువాయి -** రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగుసార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా, సమర్థుడైన పాలకునిగా, కార్మికవర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయతీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ముహమ్మద్ నిలిచారు.

## పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

**మొదటిపేజీ తరువాయి -** క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## 'ఎమ్మెల్యేగా దానం అనర్హుడే'

**మొదటిపేజీ తరువాయి -** దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరఫున పోటీ



చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఘర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతు న్నారని వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహాచంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు. "సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. గతంలో మూడు సార్లు గెలిచాను. నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం. పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయా లంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన సభాపతి ఈ పిటిషన్‌లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పును వెలువరించింది. బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిచ్చారని హైకోర్టు తెలిపింది. శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదని, ఒకవేళ మరో పార్టీ టిక్కెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేదని, అలా నిర్దేశించనపుడు రాజ్యాంగ అనర్హతను నిర్ధారించలేమని స్పీకర్ పేర్కొన్నట్లు హైకోర్టు వివరించింది.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
తెలుగు దిన పత్రిక
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



## తుఫాన్ దాటికి అతలాకుతులమైన వేపలగడ్డ పంచాయతీ

**ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు చేపట్టిన సర్పంచ్, సంబంధిత అధికారులు..!!**

**ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు**

**మాజీ జడ్పీటీసీ విజయ్ గాంధీ ఉద్ఘాటన**





**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** బూర్గంపాడు మండల పరిధిలోని సదురు వేపలగడ్డ, పోలవరం తదితరప్రాంతాలలో గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలు, భారీ ఈదురు గాలులు,తుఫాన్ ప్రభావం వలన చెట్లు, విద్యుత్ స్థంబాలు, ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయ్యని, పంటపొలాలు నీట మునిగి రైతులు నష్టపోయాయని, స్థానిక ప్రజలు,రైతుల ఆవేదనతో గ్రామాల్లో దయనీయ పరిస్థితిలు నెలకొన్నాయని,అపారమైన ఆస్తి నష్టం వాటిల్లిందని గ్రామస్తులు చెపుతున్నారు. ఆస్తి నష్టం, పంట నష్టం వాటిల్లిందని విజయ గాంధీ మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను అధికారులు వెంటనే పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని,వెను వెంటనే ప్రభుత్వ యంత్రాంగం, సంబంధిత అధికారులు త్వరగతిన చర్యలు చేపట్టాలని ఇట్టి విషయమై స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి మరియు మంత్రులకు సమాచారం ఇచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూర్గంపాడు మండల మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ తెలిపినారు. అధికారులు గట్టిగా పట్టించుకోవాలి వేపలగడ్డ , పోలవరం గ్రామంలో ఆస్తి నష్టం ఎక్కువ జరిగింది. గాలి ,వాన బీభత్సం వలన చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకూలి వీళ్ళపై విరిగిపడి ఇండ్లు అన్ని ధ్వంసం అయినాయి. విద్యుత్ స్తంభాలు తీగలు నేల కోలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అందుకు అధికారులు తగిన విధంగా మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి విజయ్ గాంధీ, గ్రామపంచాయతీ సర్పంచ్ నిరోషా, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేద కుటుంబానికిఆపదలో

## అండగా నిలిచిన ఎమ్మెల్యే పాయం

**వైద్య ఖర్చులకు ఎల్ఓసీ రూ.2.20 లక్షల అరవింద్ కుటుంబ సభ్యులకు అందజేత**



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్సలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్‌కు చేతికి సంబంధించిన ఆపరేషన్ అవసరం కాగా, నిజామ్స్ హాస్పిటల్‌లో చికిత్సకు సుమారు రూ.2,20,000 ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అరవింద్ కుటుంబానికి సహాయం అందించాలని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెంచల,రాము,ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్ఓసీ) ద్వారా రూ.2,20,000 ఆర్థిక సహాయం మంజూరు చేయించేందుకు కృషి చేశారు. దీంతో అరవింద్‌కు అవసరమైన ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ఆపరేషన్ విజయవంతం కావడంతో సంతోషించిన అరవింద్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన వైద్య చికిత్సకు ఆర్థికంగా అండగా నిలిచి, ఆపరేషన్‌కు అవసరమైన సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఆపద సమయంలో స్పందించి వైద్య చికిత్సకు అవసరమైన సహాయం అందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సేవాభావాన్ని,అభినందించారు. పేద, నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఎంతో భరోసానిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోడిశెట్టి ఖాదర్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, నాయకులు కోడి అశోక్, భూపాలపట్నం సర్పంచ్ భవతి, తదితరులు పాల్గొన్నారు.

### మారెళ్లపాడు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని

### విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**సెప్టెంబర్ 23 బుధవారం నాడు జరిగిన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నూతన, ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశేష స్పందన లభించి,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు,మాజీ ప్రజా ప్రతినిధులు,మరియు, కార్యక్రమంలో ప్రత్యక్షంగా,పరోక్షంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక,కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలిపారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ చూపిన సహకారం, సమన్వయం,అంకితభావం,అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన రైతులు, ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటి ప్రయోజనాలు అందడంతో పాటు, పినపాక నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు, తెలిపారు.

### ఎస్సీ కాలనీలో వినాయక ఉత్సవాలో

## పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన

**ప్రముఖ కాంట్రాక్టర్స్ వరలక్ష్మి కన్స్ట్రక్షన్ అధినేతలు వేములపల్లి బ్రదర్స్**





**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**అశ్వాపురం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా ప్రముఖ కాంట్రాక్టర్స్ వరలక్ష్మి కన్స్ట్రక్షన్ అధినేతలు వేములపల్లి, బ్రదర్స్,హాజరై, వినాయకుడి, విగ్రహం, వద్ద,ప్రత్యేక, పూజలు, నిర్వహించారు. అనంతరం,మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాలనీ యూత్ సభ్యులు ఏర్పాట్లు చేశారు. దీంతో కాలనీలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్స్ వరలక్ష్మి కన్స్ట్రక్షన్ అధినేతలు,వేములపల్లి కృష్ణార్జున రావు,వేములపల్లి రమేష్, బిఆర్ఎస్ పార్టీ యువజన మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, ఇసంపల్లి కృష్ణ,సుంచు రామ్మూర్తి, మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు భూక్య చందులాల్, ఉల్లి రాజేష్, గద్దల ఏడుకొండలు,కూరపాటి చలపతిరావు, ఎస్కే నయీమ్, బొజ్జంకి రవి,కమిటీ సభ్యులు మురికిపూడి అశోక్, సుంచు సందీప్, గద్దల వెంకన్న, శెట్టిపల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కలప నరికివేత అటవీ ఆక్రమణలు వన్యప్రాణుల వేటపై కఠిన నిఘా

**జిల్లా కమాండో కంట్రోల్ సెంటర్ ద్వారా డీఎఫ్ఓ**

**సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఐ ఎఫ్ ఎస్**



**భద్రాది జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** మణుగూరు అటవీ డివిజన్ పరిధిలో అటవీ సంరక్షణ చర్యలను మరింత పటిష్టం చేయడం, అటవీ సంపదను కాపాడటం, వన్యప్రాణుల సంరక్షణను బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా అటవీ అధికారి, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్, ఆధ్వర్యంలో బుధవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మణుగూరు డివిజన్ పరిధిలోని అటవీ సంరక్షణ పరిస్థితులు, అక్రమ కలప నరికివేత మరియు రవాణా, అటవీ ఆక్రమణలు, వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాల నివారణ, ఫీల్డ్ గస్తీ, అటవీ నేరాల నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా సమీక్షించారు. ప్రతి బీట్ పరిధిలోని పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యాత్మక మరియు సున్నిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని డి ఎఫ్ ఓ, సూచించారు. 24ఐ7 కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర నిఘా జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండో కంట్రోల్ సెంటర్, ద్వారా అటవీ ప్రాంతాలపై 24ఐ7 నిరంతర నిఘా కొనసాగుతోందని డీఎఫ్ఓ, తెలిపారు. సీసీటీవీ, లు, ఫీల్డ్ సిబ్బంది నుంచి అందే సమాచారం, ఇతర సాంకేతిక వనరుల ద్వారా లభించే సమాచారాన్ని సమన్వయం చేసుకుంటూ అటవీ నేరాలను ముందుగానే గుర్తించి అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అక్రమ కలప నరికివేత, అక్రమ కలప రవాణా, అటవీ ఆక్రమణలు, వన్యప్రాణుల వేట తదితర కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, కమాండో కంట్రోల్ సెంటర్, కు అందిన వెంటనే సంబంధిత రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ సిబ్బందిని అప్రమత్తం చేసి వేగవంతమైన చర్యలు చేపట్టే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు."అటవీ సంరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తతతో అనుసంధానం చేయడం ద్వారా మరింత సమర్థవంతమైన రక్షణ వ్యవస్థను రూపొందిస్తున్నాం. జిల్లా స్థాయిలో 24ఐ7 పనిచేసే కమాండో కంట్రోల్,˜ ˜ంటర్,అటవీ,రక్షణకు,ఒక,ముఖ్యమైన పర్యవేక్షణ వ్యవస్థగా పనిచేస్తుంది" అని డీఎఫ్ఓ, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐ ఎఫ్ ఎస్, తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో నిఘా మరింత పటిష్టం,అటవీ రక్షణలో బీట్ స్థాయి నుంచి రేంజ్ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డి ఎఫ్ ఓ, ఆదేశించారు. అనుమానాస్పద,కార్యకలాపాలను ముందుగానే గుర్తించి అరికట్టేందుకు నిరంతర గస్తీ నిర్వహించాలని, అటవీ నేరాలకు అవకాశం ఉన్న మార్గాలు మరియు సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అక్రమంగా కలప నరికివేత, నిల్వ, రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ సంపదకు నష్టం కలిగించే కార్యకలాపాలను ప్రారంభ దశలోనే అరికట్టేందుకు నిరోధక చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక,ప్రాధాన్యత,మణుగూరు డివిజన్‌లోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, డి ఎఫ్ ఓ, సూచించారు. అక్రమ వేట, ఉచ్చులు, విద్యుత్ తీగలు వంటి ప్రమాదకర పద్ధతులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు,అటవీ అగ్ని ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించేందుకు సున్నిత ప్రాంతాలను గుర్తించాలని, ఫైర్ లైన్లు, గస్తీ, స్థానిక ప్రజలతో అవగాహన కార్యక్రమాలు మరియు వేగవంతమైన స్పందన వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేయాలని డి ఎఫ్ ఓ, సూచించారు. అడవిని కాపాడటం అంటే,భవిష్యత్తును, కాపాడటమే"డీఎఫ్ఓ, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్, మాట్లాడుతూ, "అడవులను కాపాడటం అంటే కేవలం చెట్లను కాపాడటం మాత్రమే కాదు. వన్యప్రాణులు, జీవవైవిధ్యం, నీటి వనరులు, నేల మరియు భవిష్యత్ తరాలకు అవసరమైన సహజ వనరులను పరిరక్షించడం. అటవీ సంరక్షణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను,సమర్థవంతంగా,నిర్వర్తించినప్పుడే,ఈ,లక్ష్యం,సాధ్యమవుతుంది" అని అన్నారు. అటవీ సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని, అటవీ ప్రాంతాల సమీప గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ "అడవి మన సహజ సంపద -- దాని సంరక్షణ మనందరి బాధ్యత"అనే సందేశాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అటవీ సంపదను అక్రమంగా నాశనం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అటవీ సంరక్షణకు సహకరించే ప్రజలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మణుగూరు డివిజన్ ఎఫ్ డి ఓ, బాబు. సి ఎఫ్, రేంజ్ అధికారులు ఉపేంద్ర, సత్తార్ అలీ, స్నేహలత, మరియు సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, ఫ్రంట్‌లైన్ సిబ్బంది తదితరులు పాల్గొని తమ పరిధిలోని అటవీ సంరక్షణ చర్యలు, సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై వివరాలు సమర్పించారు.

## ఈఎంఐ ఆలస్యమైతే ఇంటి ముందు మహిళలపై కుటుంబ సభ్యులపై ఒత్తిళ్లు!

**మణుగూరు లో ఆటో ఫైనాన్స్ దందాను అరికట్టాలి**

**గద్దల నాగేశ్వరరావు డిమాండ్**



**మణుగూరు, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గం లో, మణుగూరులో,నీ ఆటో ఫైనాన్స్ వ్యవహారం రోజు రోజుకి, చర్చనీయాంశంగా మారుతోంది అని స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గద్దల నాగేశ్వరరావు విలేకర్ల కి తెలిపారు. ఆటోలు కొనుగోలు చేసేందుకు ఫైనాన్స్ తీసుకుంటున్న పలువురు వినియోగదారులు రుణం తీసుకునే సమయంలో ఒక రకంగా.. ఈఎంఐలు ఆలస్యమైన తర్వాత మరో రకంగా వ్యవహరిస్తున్నారంటూ ఫైనాన్స్ వ్యాపారులపై, ఆయన ఆరోపణలు చేస్తున్నారు. ఒకటి రెండు నెలలు వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడితే ఇంటి వద్దకు వచ్చి ఒత్తిడి చేయడం, కుటుంబ సభ్యులు, మహిళలకు ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. వసూళ్ల పేరుతో వేధింపులా?రుణం తీసుకున్న వ్యక్తి నుంచి బకాయిలను వసూలు చేసుకునే హక్కు రుణదాతకు ఉన్నప్పటికీ.. అందుకు చట్టబద్ధమైన విధానాలను అనుసరించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ పరిధిలోని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణ వసూళ్ల సమయంలో బెదిరింపులు, శారీరక లేదా మౌఖిక వేధింపులు, బహిరంగంగా అవమానించడం, కుటుంబ సభ్యులు, స్నేహితుల వ్యక్తిగత గోప్యతలోకి చొరబడటం వంటి చర్యలకు పాల్పడకూడదని మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. ఫైనాన్స్ సంస్థకు అనుమతి ఉందా?మణుగూరులో వందల సంఖ్యలో ఆటోలకు ఫైనాన్స్ చేస్తున్న వ్యాపారులు ఏ సంస్థ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు? వారు బ్యాంకులు, ఆర్‌బీఐ నియంత్రణలోని ఎన్‌బీఎఫ్‌సీలు, లేక స్థానిక మనీలెండింగ్ వ్యాపారులా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అని గద్దల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సేవల జాబితాలో మనీలెండింగ్ లైసెన్స్‌కు ప్రత్యేక సేవ ఉండటం గమనార్హం. వడ్డీ.. చార్జీల వివరాలెక్కడ?రుణం ఇచ్చే ముందు వడ్డీ రేటు, ఇతర చార్జీలు, ఈఎంఐలు, ఆలస్య రుసుములు,రుణ,నిబంధనలు వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయడం కీలకం. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం నియంత్రిత ఎన్‌బీఎఫ్‌సీలు రుణ నిబంధనలను రుణగ్రహీతకు అర్థమయ్యే భాషలో,స్పష్టంగా,తెలియజేయాలి. అధికారుల తనిఖీలు ఎక్కడ?మణుగూరు ప్రాంతంలో,ఇలాంటి,ఫైనాన్స్,కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు ఎన్ని? వాటికి ఉన్న లైసెన్సులు ఏమిటి? వసూలు చేస్తున్న వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజులు, ఆలస్య రుసుములు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? రుణ ఒప్పందాల్లో పేర్కొన్న విధంగానే వసూళ్లు జరుగుతున్నాయా? అన్న అంశాలపై సంబంధిత అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని, అంటూ బాధితులను వేధిస్తున్న ప్రైవేటు వ్యాపారులపై, గాని, ప్రవేట్, ఫైనాన్సులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మాదిగ జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గద్దల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు .ఫైనాన్స్ తీసుకునే సమయంలో చెప్పిన నిబంధనలకు భిన్నంగా తర్వాత వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా మహిళలు, కుటుంబ,సభ్యులు,స్నేహితులకు ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారనే ఫిర్యాదులపై కూడా,అధికారులు,దృష్టి,సారించాల్సిన అవసరం ఉందని నాగేశ్వరరావు తెలిపారు. ఆటో ఫైనాన్స్ వ్యాపారానికి సంబంధించి సంబంధిత సంస్థకు ఉన్న రిజిస్ట్రేషన్, లైసెన్స్, రుణ ఒప్పందాలు, వడ్డీ రేట్లు, వసూళ్ల విధానం తదితర అంశాలను పరిశీలిస్తే అసలు వ్యవహారం ఏమిటన్నది స్పష్టమవుతుందని తెలిపారు . ఫైనాన్స్ పేరుతో వ్యాపారం చేస్తున్న,ప్రతి,సంస్థ, చట్టబద్ధమైన ,అనుమతులతోనే,కార్యకలాపాలు నిర్వహిస్తుందా? లేదా అనధికారికంగా రుణాలు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తుందా? అని మాదిగ జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గద్దల నాగేశ్వరరావు, ప్రశ్నించారు. ప్రైవేట్ ఫైనాన్సులకు సంబంధించిన దానిపై సంబంధిత శాఖలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### క్రైస్తవ సమాజ సమస్యల పై

## పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో పాల్గొన్న

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** దుమ్ముగూడెం మండలం, మారాయిగూడెం గ్రామంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి ఘనంగా, ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రైస్తవ సమాజానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై పాస్టర్లతో ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ఆత్మీయంగా చర్చించారు. ముఖ్యంగా ప్రార్థనా మందిరాలకు సంబంధించిన సమస్యలు, క్రైస్తవ సమాజ సంక్షేమం, పాస్టర్ల సమస్యలు, విద్యా--వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. అలాగే ప్రజలందరికీ సమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. క్రైస్తవ,సమాజం,ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు, పాస్టర్లు మరియు క్రైస్తవ సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సదస్సు, ఉచిత వైద్య శిబిరం





**భువనగిరి సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని హోమియోపతి ఆసుపత్రిలో ఆయుష్ ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాస్త్రం అత్యంత పురాతనమైన చికిత్సా విధానమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం వంటి వివిధ వైద్య విధానాల ద్వారా రోగులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆహార నియమాలను పాటిస్తూ, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ వి. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు, వైద్య శిబిరంలో జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ చక్రధర్, జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుర్గా ప్రకాష్, సామాజిక కార్యకర్తలు మాటూరి బాలేశ్వర్, జంపాల అంజయ్య, హోమియోపతి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భారతి, డాక్టర్ సంధ్య, డాక్టర్ అరుణ, ఫార్మాసిస్టు మంజుల, ఆసుపత్రి సిబ్బంది బాలలక్ష్మి, సంధ్యారాణి, అజీమ్, రమేష్‌తో పాటు పలువురు రోగులు పాల్గొన్నారు.

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల బరిలో అలవాల రాజా మాదిగ...




**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**సామాజిక ఉద్యమకారులు, వికలాంగుల, వితంతువుల, వృద్ధుల, జీవితాలు మనోధైర్యం వికలాంగుల పెన్షన్ పెంపు,ఆరోగ్యశ్రీ సాధన, పేద ప్రజలకు బియ్యం పెంపు వంటి అనేక సేవలు అందించిన గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వారి ఆలోచన విధానంతో పయనిస్తున్న అలవాల రాజా మాదిగ అనే నేను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల బరిలో నిలుచున్నాను...ఆధిపత్య అగ్ర కులాలు మాత్రమే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో ఉంటూ సేవల పేరు మీద ఏం చేస్తున్నారో మనం గమనిస్తూనే ఉన్నాం. పేపర్లో ఫోజులకు, సేవ ముసుగులో వాళ్ళు చేస్తున్న దోపిడిని అరికట్టాలని, నిస్వార్థమైన సేవను చేసేందుకు సామాజిక సేవ లక్ష్యంగా అడుగులుస్తూ మహనీయుల బాటలో పయనిస్తూ, పేదలకు అండగా ఉంటున్నాను.. పేదలకు మరింత సేవ చేసే అవకాశం కోసం రాజకీయ ప్రోబలం లేని, కులమత లకు అతీతంగా మానవత్వంతో పెద్దలు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సేవ మార్గంలో మరింత సేవ చేస్తానని తెలియజేస్తూన్నాను. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం ఉన్న సభ్యులు నాకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలుపుకు సహకరిస్తారని ఆశిస్తున్నాను.....

### పంతంగి గ్రామాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో శోభారాణి

**ఆర్ అండ్ బి రోడ్లు,పంట కుంట,ఫార్మ్ ఫాండ్ పనుల పరిశీలన**





**చౌటుప్పల్, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామాన్ని జడ్పీ సీఈవో శోభారాణి సదర్శించారు. గ్రామంలో సాంక్షన్ అయిన ఆర్ అండ్ బి రోడ్ ను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో పనులు జరుగుతున్న పంట కుంట,ఫార్మ్ ఫాండ్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీని సందర్శించి ఎలెనినో ప్రభావం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ పంట కుంటలు మరియు నీటి కుంటలు,ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న చెరువును పూడిక తీసి నీరు నిలిచే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్,వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్ రెడ్డి,మాధవుని పరమేశ్వరి శంకర్,పంచాయతీ కార్యదర్శి పద్మజ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్,మాజీ సర్పంచ్ అంతటి రమేష్ గౌడ్,కడగంచి చలమందరాజు,కడగంచి జనార్ధన్,పబ్బు లింగస్వామి,కడగంచి వెంకటేశం,బోయ దశరథ, ఏపీవో ఈశ్వరయ్య,ఈసి రమాదేవి,ఫీల్డ్ అసిస్టెంట్ లలిత,తదితరులు పాల్గొన్నారు.ః

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
తెలుగు దిన పత్రిక
www.tolivaartha.com www.epaper.tolivaartha.com



# తుఫాను బాధితుల కుటుంబాలను పరామర్శ...

**అధైర్య పడకండి అండగా నేనుంటా....**

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**బూర్గంపాడు మండలంలోని మొరంపల్లిబంజర, వేపలగడ్డ గ్రామాల్లో నిన్న సంభవించిన తుఫాను, భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా జరిగిన నష్టాన్ని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులతో కలిసి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్లను, ఇతర ప్రాంతాలను పరిశీలించి, బాధిత కుటుంబాలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.తుఫాను ప్రభావంతో స్వల్ప గాయాలకు గురైన ప్రజలను కూడా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పరామర్శించి,వారి,ఆరోగ్య,పరిస్థితిని,అడిగి,తెలుసుకున్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు.ఈ సందర్భంగా బాధితులు తమ ఇళ్లకు, ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్న కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే, పాయం వెంకటేశ్వర్లు ఇల్లు కోల్పోయిన అర్హులైన బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల





పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అలాగే తుఫాను కారణంగా ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించి విద్యుత్, సరఫరాను, పునరుద్ధరించాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు నీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. రెండు గ్రామాల్లో ప్రజలకు విద్యుత్, తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి, ప్రతి బాధిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని నమోదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రకృతి వైపరీత్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, తెలుపుతూ,అధైర్య పడకండి అండగా నేను ఉంటా.... అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తుఫాన్ బాధ్యత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు,సూచించారు. మొరంపల్లిబంజర, వేపలగడ్డ గ్రామాల ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలిచి ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్, తాగునీరు, వైద్య సహాయం తదితర సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘ సమావేశం

**నిరుపయోగంగా ఉన్న షెడ్డును ఉపయోగంలోకి తీసుకురావాలి**

**నల్లాలు దొంగిలించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి**

**జీవాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి**

**మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు**

**చౌటుప్పల్,¯సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం చౌటుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలో వృత్తిదారుల ఆఫీసులో గుణముని ఐలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం యూనియన్ డైరెక్టర్ బండారు నరసింహ,జిఎంపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండే శ్రీశైలం మాట్లాడుతూ.. చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలో నిర్మించిన రూ.50 లక్షలు రూపాయలతో గొర్రెల మార్కెట్ యార్డ్ వినియోగంలోకి తీసుకురాకుండా నిరుపయోగంగా ఉన్నది.మంచినీటి కోసం వేసిన బోరు మోటర్ అదేవిధంగా జీవాలు త్రాగడం కోసం నిర్మించిన నల్లాలు పూర్తిగా ధ్వంసం చేసి




దొంగిలించిన వారిపై చట్టపరమైన చర్య తీసుకుని గొర్రెల మేకల పెంపకం దారుల అభివృద్ధి కోసం నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డ్ వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ కు వినతి పత్రం అందజేశారు.అదేవిధంగా గొర్రెల మేకలకు ఇవ్వవలసిన నట్టల నివారణ మందులు ప్రతి గ్రామంలో మూగజీవాలకు త్రాగడానికి నీటి తొట్లను ఏర్పాటు చేసి,త్రాగునీటి సౌకర్యం అందించాలని,మండల వద్దనే వైద్య



సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన మూగజీవాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం అమలు చేసి పెంపకం దారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి జీఎంపీస్ చౌటుప్పల మండల అధ్యక్షులు భీమనగని బాలరాజ్,మున్సిపల్ కన్వీనర్ గుణమోని ఐలయ్య,జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నారీ వెంకటేశం,నాయకులు కడగంచి చలమంద రాజు,బత్తుల దాసు,గజ్జి పాండు,గడగోటి జంగయ్య,జెనిగల యాదయ్య,అరిగే బీరప్ప,గాజుల అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ దెబ్బకు రైతన్న విలవిల.. నేలకొరిగిన పంటలు

**200 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం**

**విరిగిన కరెంటు స్తంభాలు.. తెగిన లైన్లు**

**నేలవాలిన పత్తి, మిర్చి, వరి**

**ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు**

**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**బూర్గంపాడు మండలం వేపలగడ్డ, మొరంపల్లి బంజర్ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం అన్నదాతలపై తీవ్ర ప్రభావం చూపింది. గంటల వ్యవధిలో వీచిన బలమైన గాలులు, వర్షం కారణంగా పంట పొలాలు దెబ్బతినడంతో రైతులు ఆవేదనలో మునిగిపోయారు. పత్తి, మిర్చి, వరి పంటలు పెద్దఎత్తున నేలవాలడంతో సుమారు 150 నుంచి 200 ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పాటు విద్యుత్ తీగలు తెగిపడటం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. నెలల తరబడి పంటలను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు ప్రకృతి ఒక్కసారిగా గట్టి షాక్ ఇచ్చింది. సాగు కోసం చేసిన ఖర్చులు, కూలీలకు చెల్లించిన డబ్బులు, ఎరువులు, విత్తనాల కోసం పెట్టిన





పెట్టుబడులు అన్నీ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి. పంట దిగుబడితో కుటుంబ అవసరాలు తీర్చుకోవాలని, అప్పులు చెల్లించాలని భావించిన రైతులకు నేలకొరిగిన పంటలు నిరాశనే మిగిల్చాయి. చేతికొచ్చే సమయంలో పంట దెబ్బతినడంతో తమ



పరిస్థితి దిక్కుతోచని విధంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వాతావరణం ఇంకా అనుకూలంగా లేకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతోంది. తుఫాన్ ప్రభావం మరికొంతకాలం ఉంటే ఇప్పటికే దెబ్బతిన్న పంటలకు అదనంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. నష్టాన్ని కళ్లారా చూసిన రైతులు ఇక ప్రభుత్వ సాయంపైనే ఆశలు పెట్టుకున్నారు. అధికారులు వెంటనే పొలాలను పరిశీలించి నష్టాన్ని నమోదు చేయడంతో పాటు బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని, తెగిపోయిన విద్యుత్ లైన్లను త్వరగా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు తప్పనిసరి

**తుర్కపల్లి, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా తెలిపారు..వ్యవసాయ భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు .రైతు నమోదు చేసుకుంటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలకు అర్హులు అవుతారని అన్నారు. రైతు ఐడి ఉంటేనే రైతు పండించిన పంట కాంటాలో కొనుగోలు చేయబడుతుందని తెలిపారు .పట్టా భూమి కలిగిన ప్రతి రైతు ఆధార్ కార్డు ఆధార్ తో లింకు చేయబడ్డ ఫోను తీసుకొని వచ్చి రైతు చేయించుకోవాలని తెలిపారు. రైతు నమోదు చేసుకొని వారు తమ క్లస్టర్ వలన సంపాదించాలని తెలిపారు ఈ అవకాశాన్ని సెప్టెంబర్ 30 తారీకు వరకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

**షిరిడి పుష్కర ద్వారక ఆలయానికి రూ.3.5 లక్షల విలువైన రథం బహుకరణ**

**భద్రాద్రి జిల్లా సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**బూర్గంపాడు మండలం సారపాకలోని షిరిడి పుష్కర సాయిబాబా ఆలయానికి ఇరవెండికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.3.5 లక్షల విలువైన రథాన్ని బహుకరించారు. ట్రస్టు ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ- విజయరేణుక దంపతులు గురువారం ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం రథాన్ని ఆలయ కమిటీ



బాధ్యులకు అందజేశారు. తమ కుమారుడు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్–నీలిమ దంపతుల సౌజన్యంతో స్వామి వారికి రథం అందించినట్లు ట్రస్టు ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగమనేని భాస్కర్రావు, తీగల జీవన్రెడ్డి, ఊటుకూరి రమణమూర్తి, అక్కెర భాస్కరాచారి, కొత్తపల్లి సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ లడ్డూ వేలంలో అరుదైన హ్యాట్రిక్

**బిరూ.10,10,116లతో ఆల్‌టైమ్ రికార్డు..**

**బివరుసగా మూడోసారి లడ్డూను దక్కించుకున్న గెంజోటి అరుణ్ కుమార్**





**సికింద్రాబాద్, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**పంజాగుట్ట పరిధిలోని చింతల్ బస్తీ ప్రాంతంలో ఆల్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ వేలంలో గెంజోటి అరుణ్ కుమార్ రూ.10,10,116లకు లడ్డూను సొంతం చేసుకుని వరుసగా మూడోసారి విజేతగా నిలిచి అరుదైన హ్యాట్రిక్ సాధించారు.ఈ ఏడాది లడ్డూ వేలం రూ.10,10,116లతో ముగియడం విశేషం. ఈ మొత్తం ఇప్పటివరకు నిర్వహించిన లడ్డూ వేలాల్లో ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. వరుసగా మూడోసారి లడ్డూను దక్కించుకున్న అరుణ్ కుమార్ విజయంపై అసోసియేషన్ సభ్యులు, భక్తులు, చింతల్ బస్తీ--వీర్‌నగర్ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గెంజోటి అరుణ్ కుమార్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా అభినందించారు. గణనాథుని ఆశీస్సులతో ఆయన కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌లో నిర్వహించిన

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నా నియోజకవర్గ .



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):ప్రతి నిధి.** ప్రగతి నగర్: గణేష్ ఉత్సవాల్లో భాగంగా, శిల్ప పారడైస్ కల్చరల్ ఉవెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ ఎ.వి. రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, కోలాట బృందం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం హన్మంతన్న గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను అభినందిస్తూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మద్ది నారాయణ రెడ్డి, వీరబాబు, ప్రశాంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మలకు హాజరై నివాళులర్పించిన

# మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్.

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సెప్టెంబర్ 24 ( తొలివార్త ): ప్రతి నిధి.** మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఈరోజు గాంధీనగర్‌లోని ఎన్ఆర్ ప్యాలెస్‌లో జరిగిన కాంగ్రెస్ నాయకుడు, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మంజుల్కర్ తండ్రి కీర్తిశేషులు మంజుల తిమ్మయ్య దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంజుల తిమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం షాపూర్ ఎం.జె. ఫంక్షన్ హాల్‌లో జరిగిన దుండిగల్‌కు చెందిన ఏలూరి శ్రీనివాస్ గౌడ్ దశదిన కర్మ కార్యక్రమానికి కూడా కూన శ్రీశైలం గౌడ్ హాజరై, వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



**చౌటుప్పల్,¯ సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.చౌటుప్పల్ సిఐ జి.మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాంబియాష్ కేవాట్(37)అను అతను లింగోజిగూడెం అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ఒక చిన్న టిఫిన్ సెంటర్లో పనిచేస్తున్నాడు.తేదీ 23.09.2026 నాడు రాత్రి అందాజ 10:00 గంటల సమయంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం చూసేందుకు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి 65వైపు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో విజయవాడ వైపు నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు నెంబర్ టిఎస్ 09ఎఫ్ క్యూ 1881 గల దాని డ్రైవర్ అతనికి టక్కరి ఇవ్వగా అతని తలకు మరియు ఇతర చోట్ల బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే చనిపోయినాడు.ఇతడు పనిచేసే టిఫిన్ సెంటర్ యజమాని ప్రభు చరణ్ ఫిర్యాదు మేరకు పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సిఐ మన్మథ కుమార్ తెలిపారు.

# గుండ్ల సింగారం బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు



**నూతనకల్... సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని గుండ్ల సింగారం బ్రిడ్జిని మండల స్పెషల్ ఆఫీసర్ ఎంఎ భారతి ఎంపీడీవో సునీత గురువారం పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహ పరిస్థితిని, రాకపోకలను వారు పరిశీలించారు. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బ్రిడ్జిపై నీటి ప్రవాహం పెరిగిన సమయంలో ప్రజలు, వాహనదారులు ప్రమాదకరంగా రాకపోకలు సాగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వర్షాల పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు..

# ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డుల ప్రదానం

**వలిగొండ సెప్టెంబర్ 24 ( తొలివార్త ):**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించి ఉత్తమ అవార్డులను అందజేశారు. వెల్వర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సంగిశెట్టి రాములును ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారి జి. జలంధర్ రెడ్డి, సుంకోజు భాస్కర్ శాలువాతో సన్మానించి అవార్డును అందజేశారు. అలాగే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులు వీరస్వామి, పీఈటీ గండమల్ల స్వామిరాజ్‌లను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జేతురామ్ తండాలో పోషక వారోత్సవాలు

**మాట్లాడుతున్న దృశ్యం**



**తుర్కపల్లి, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని జేతు రామ్ తండా గ్రామంలోని అంగన్వాడి ఆధ్వర్యంలో పోషక వారోత్సవాల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ నైజీ మున్నీసా లు పాల్గొని మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు మొదటి వెయ్యి రోజులు చాలా కీలకమని అన్నారు. గర్భం దాల్చినప్పటి నుండి రెండు సంవత్సరాల వరకు సరియైన పోషకాహారం అందిస్తేనే పిల్లలు ఆరోగ్యంగా తెలివిగా ఎదుగుతారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బలవర్ధక ఆహారము, గుడ్లు, పాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రక్తహీనతను నివారించడానికి ఆకుకూరలు, పండ్లు పప్పు దినుసులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. చిన్నారులు గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని పరిశుభ్రత పాటించాలని, స్వచ్ఛమైన నీటిని వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. పోషకాహారం ఆరోగ్యకర జీవనం బలమైన సమాజం నిర్మించడానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వీణా దేవి అంగన్వాడీ టీచర్ శోభ పాల్గొన్నారు

# వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన తహసిల్దార్

**చెరువు వద్ద పరిశీలిస్తున్న దృశ్యం**



**తుర్కపల్లి, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాటు పనులను తాసిల్దార్ రవికుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి వినాయకుని నిమజ్జన సమయంలో శాంతియుతంగా నిమజ్జనాన్ని నిర్వహించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు

# షాదుల్లా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఎం కు ఘన సన్మానం

**సన్మానిస్తున్న దృశ్యం**

**తుర్కపల్లి, సెప్టెంబర్ 24 ( తొలివార్త ):** తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాపల్లి శ్రీనివాస్ సింగపూర్ విద్య అధ్యయన యాత్ర ముగించుకొని వచ్చిన సందర్భంగా సాదుల్లా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సాదుల్లా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తరఫున తుర్కపల్లి పాఠశాల




ప్రధానోపాధ్యాయుడు రాపల్లి శ్రీనివాస్ ఈ అంతర్జాతీయ అధ్యాయన యాత్రకు ఎంపిక కావడం మన ప్రాంతానికి మన పాఠశాలకు ఎంతో గర్వకారణం అని, ఇది మన అందరికీ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అర్థాన్ని వ్యక్తం చేశారు అభివృద్ధి చెందిన సింగపూర్ లాంటి దేశాల్లో అమలు చేస్తున్న ఆధునిక బోధనా పద్ధతులు విద్యా విధానాలను మన పాఠశాలలో సైతం సమర్ధవంతంగా వినియోగించి విద్యార్థులను ఉత్తమ పౌర్లుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. రాబోవు రోజుల్లో ఇలాంటి మరెన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు అధ్యయన పర్యటనలో పాల్గొంటూ తుర్కపల్లి పాఠశాల విద్యారంగంలో మరింత ముందంజలో నిలబెట్టి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీష్ కుమార్, విష్ణు, జ్యోతి, సుజాత ,విశ్వేశ్వరరావు, హరిత, అంబటి గోవిందు, అనూష, తదితరులు పాల్గొన్నారు

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com



# స్లీపర్ బస్సులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు

**9 మంది సజీవదహనం**

**ఉత్తరప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం**

**యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై స్లీపర్ బస్సులో అకస్మాత్తుగా మంటలు**

**మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన రాష్ట్రపతి**

**పరిహారం ప్రకటించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. గ్రేటర్ నోయిడాలోని జేవార్ విమానాశ్రయం సమీపంలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒక మహిళ, ఎనిమిది మంది పురుషులు సహా మొత్తం తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. మరికొందరు గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బిహార్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న రాజ్ కల్పనా ట్రావెల్స్ బస్సు 50 మంది ప్రయాణికులతో ఢిల్లీ నుంచి మహోబా వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రయాణికులు నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఎక్స్‌ప్రెస్‌వే పక్కకు ఆపాడు. అయితే క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో పాటు దట్టమైన పొగ బస్సు మొత్తం కమ్మేసింది. దాంతో ప్రయాణికుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రాణభయంతో కొందరు ప్రయాణికులు తమ వస్తువులను అక్కడే వదిలేశారు. బస్సు నుంచి బయటపడేందుకు కొందరు కిటికీల నుంచి దూకారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు సహా పలువురు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అయితే తొమ్మిది మంది మాత్రం మంటల్లో చిక్కుకుని బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారని అధికారులు తెలిపారు. ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు. అయితే అప్పటికే బస్సులోని కొంతమంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకున్నారని వెల్లడించారు. ఘటన అనంతరం పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ప్రాథమిక విచారణ ప్రకారం, బస్సు ఏసీ వ్యవస్థలో ఏర్పడిన నిప్పురవ్వ కారణంగా ఇంజన్ లూబ్రికెంట్ ఆయిల్‌కు మంటలు అంటుకుని వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి పూర్తి కారణాలపై పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ప్రమాదం తర్వాత యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. కాలిపోయిన బస్సును అక్కడి నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. మృతుల గుర్తింపు, గాయపడిన వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్సులో మంటలు చెలరేగిన సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రపోతున్నట్లు ప్రమాదం నుంచి బయటపడిన వారు తెలిపారు. మంటలు వ్యాపిస్తున్న విషయం గుర్తించేలోపే బస్సు మొత్తం దట్టమైన పొగతో నిండిపోయిందని చెప్పారు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని తెలిపారు. పొగ కారణంగా బస్సు నుంచి బయటకు రావడం కష్టంగా మారిందని ఓ ప్రయాణికురాలు చెప్పారు. ఒక్కసారిగా ప్రయాణికులంతా బయటకు పరుగులు తీయడంతో తోపులాట జరిగిందని, ఈ గందరగోళం కారణంగా కొందరు ప్రాణాలు కోల్పోయారని వాపోయారు. "నేను నిద్రపోయిన తర్వాత బస్సుకు నిప్పంటుకుంది. ఎవరో నన్ను నిద్రలేపడంతో వెంటనే బయటకు రావడానికి ప్రయత్నించాం. దట్టమైన పొగ కారణంగా బయటపడటం చాలా కష్టంగా మారింది. తీవ్ర భయాందోళన మధ్య ఎలాగోలా బస్సు నుంచి బయటకు వచ్చాం. బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది. ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి సరైన చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం ప్రకటించారు. ప్రమాదంపై అధికారులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

# ప్రభుత్వ పథకాల ప్రచారానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు

**నెలకు రూ.1.50 లక్షల వరకు**

**సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు వేగంగా చేరవేసేందుకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది**

**సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్‌మెంట్ పాలసీకి ఆమోదం తెలిపింది**

**ఇకపై క్రియేటర్ల ద్వారా సోషల్ మీడియాలో ప్రభుత్వం ప్రచారం నిర్వహించనుంది**

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత వేగంగా చేరవేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్‌మెంట్ పాలసీ'కి కేబినెట్ ఆమోదం లభించింది. ఈ విధానం ప్రకారం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రభావం ఉన్న క్రియేటర్లను ఎంప్యానెల్ చేసి ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో భాగస్వాములను చేయనున్నారు. తొలుత ఏడాది కాలానికి ఒప్పందం కుదుర్చుకుని, పనితీరు సంతృప్తికరంగా ఉంటే మరో రెండేళ్ల వరకు పొడిగించే అవకాశం కల్పించారు. గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసిన తర్వాత ఈ పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. సామాజిక మాధ్యమ క్రియేటర్లను ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించారు. లక్ష మందికి పైగా ఫాలోవర్లు ఉన్నవారిని కేటగిరీ-ఏ, 50 వేల నుంచి 99,999 మంది వరకు ఉన్నవారిని కేటగిరీ-బీ, 25 వేల నుంచి 49,999 మంది వరకు ఉన్నవారిని కేటగిరీ-సీ, 10 వేల నుంచి 24,999 మంది వరకు ఉన్నవారిని కేటగిరీ-డీగా పరిగణిస్తారు. ఏదైనా ఒక సామాజిక మాధ్యమ వేదికలో కనీసం 10 వేల మంది ఫాలోవర్లు ఉంటేనే దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుంది. ఇన్‌ఫ్లుయెన్సర్లు పోస్టు చేసే కంటెంట్ రకాన్ని బట్టి ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది. అత్యధిక రీచ్ ఉన్న ఒక్క ప్రధాన ప్లాట్‌ఫామ్‌కే నగదు చెల్లింపు ఉంటుంది. అయితే అదే కంటెంట్‌ను తమ ఇతర సామాజిక మాధ్యమ ఖాతాల్లో ఉచితంగా పోస్టు చేయడం తప్పనిసరి. ఒక క్రియేటర్‌కు నెలకు గరిష్ఠంగా రూ.1.50 లక్షలు చెల్లించే పరిమితిని నిర్ణయించారు. ప్రభుత్వం అందించే గ్రాఫిక్ పోస్టులకు కేటగిరీ-ఏకు రూ.1,500, బీకి రూ.1,000, సీకి రూ.750, డీకి రూ.500 చొప్పున చెల్లిస్తారు. ప్రభుత్వం అందించే ఆడియో, వీడియో పోస్టులకు కేటగిరీ-ఏకు రూ.2,000, బీకి రూ.1,500, సీకి రూ.1,000, డీకి రూ.750 చొప్పున ఇస్తారు. క్రియేటర్లు స్వయంగా రూపొందించే వీడియోలకు కేటగిరీ-ఏకు రూ.15,000, బీకి రూ.7,500, సీకి రూ.5,000, డీకి రూ.2,500 చొప్పున పారితోషికం చెల్లించనున్నారు. ప్రత్యేక యాప్, పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. స్క్రూటినీ కమిటీ పరిశీలనతో పాటు రెండు దశల తనిఖీల అనంతరం ఎంపికైన వారికి ఎంప్యానెల్‌మెంట్ కార్డులు జారీ చేస్తారు. గత 60 పోస్టులను పరిశీలించి అశ్లీల, విద్వేషపూరిత లేదా అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే దరఖాస్తును తిరస్కరిస్తారు. ఒప్పంద కాలం మొత్తం కూడా ఈ అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. కనీసం రెండు పోస్టులు లేదా వీడియోలు తమ మొత్తం ఫాలోవర్ల సంఖ్య కంటే ఎక్కువ వ్యూస్ సాధించి ఉండాలి. గత ఆరు నెలల్లో వారానికి రెండు పోస్టుల చొప్పున 48కు పైగా మంచి రీచ్ ఉన్న పోస్టులు చేసిన రికార్డు ఉండాలి. ప్రభుత్వానికి సంబంధించిన ఫ్యాక్ట్ చెక్ పోస్టులను ఉచితంగా ప్రచారం చేయడం తప్పనిసరి. ఈ నిబంధనను పాటించకపోతే ఎంప్యానెల్‌మెంట్ రద్దు చేస్తారు. 18 ఏళ్లు నిండిన వ్యక్తులు మాత్రమే నమోదు చేసుకునే అవకాశం ఉండగా, కంపెనీలు, సంస్థలకు ఈ విధానంలో అవకాశం లేదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చనున్నారు. సామాజిక మాధ్యమ క్రియేటర్లకు పారితోషికం చెల్లించే విధానం ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమల్లో ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌లో కేటగిరీల వారీగా నెలకు రూ.2 లక్షలు, రూ.1 లక్ష, రూ.50 వేలు, రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు. రాజస్థాన్‌లో నెలవారీ గౌరవ వేతనంగా రూ.25 వేలు, రూ.15 వేలు ఇస్తున్నారు. పంజాబ్‌లో వీక్షణలు, ప్రాథమిక రేటు ఆధారంగా చెల్లింపులు చేస్తుండగా, ఉత్తర్‌ప్రదేశ్‌లో సామాజిక మాధ్యమ వేదికల ఆధారంగా గరిష్ఠ పరిమితిని నిర్ణయించారు. అక్కడ ఎక్స్‌కు రూ.5 లక్షలు, ఫేస్‌బుక్‌కు రూ.4 లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌కు రూ.3 లక్షలు, యూట్యూబ్ వీడియో కంటెంట్‌కు రూ.8 లక్షల వరకు నెలకు చెల్లింపులు చేస్తున్నారు.

# పోలీస్ జాబ్ అర్హత మార్కుల్లో మార్పులు

**30 శాతం సాధిస్తే క్వాలిఫై అయినట్లే**

**తెలంగాణలో నవంబర్ 29న ఎస్సై, డిసెంబర్ 20న కానిస్టేబుల్‌కు సంబంధించిన ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నారు**

**ఎస్సైకి 1,60,756, కానిస్టేబుల్‌కు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.**

తెలంగాణ పోలీస్ ఉద్యోగాల్లో భాగంగా యూనిఫాం సర్వీసులకు సంబంధించి ప్రిలిమినరీ రాత పరీక్షకు సన్నద్ధతపై అభ్యర్థులు దృష్టి సారించారు. నవంబర్ 29న రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల వారీగా ఆయా కేంద్రాల్లో ఎస్సై, డిసెంబర్ 20న కానిస్టేబుల్, అందుకు సమాన స్థాయి పోస్టులకు సంబంధించి 15 నుంచి 18 కేంద్రాల్లో రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు మండలి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈసారి ఎస్సై, ఆ స్థాయి పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్, ఆ స్థాయి పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థుల నుంచి అప్లికేషన్లు వచ్చాయి. 2022 నాటి నోటిఫికేషన్‌తో పోల్చితే ఈసారి కనీస అర్హత మార్కుల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. క్రితంసారి అభ్యర్థులందరికీ కనీస అర్హత మార్కుల్ని 30 శాతంగానే పరిగణించారు. ఈసారి మాత్రం దీనిని మరింతగా కుదించడం




పలువురు అభ్యర్థులకు చాలా వరకు కలిసి వచ్చే అంశంగా మారింది. ఈసారి పీడబ్ల్యూటీ (ప్రిలిమినరీ ఎగ్జామ్ టెస్ట్)లో అర్హత కోసం ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 30 శాతం మార్కులే సాధించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ లెక్కన పీడబ్ల్యూటీలో మొత్తం 200 మార్కులకు గానూ కనీసం 60 మార్కులు సాధిస్తే ఈ పోటీలో తొలిమెట్టు గట్టెక్కినట్లే. మిగిలిన కేటగిరీల అభ్యర్థులకు మరింత తక్కువగానే కనీస మార్కులను నిర్ణయించారు. బీసీ అభ్యర్థులైతే 25 శాతం (50 మార్కులు), ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనిక ఉద్యోగులు, హోంగార్డులకైతే 20 శాతం (40) మార్కులను మాత్రమే అర్హతగా నిర్ణయించారు. వాస్తవానికి ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలోనే జరగనున్నప్పటికీ దీన్ని బోర్డు అధికారులు వడబోత పరీక్షగానే పరిగణిస్తున్నారు. ఇందులో సాధించిన మార్కుల్ని తుది ఫలితాల్లో పరిగణనలోకి తీసుకోకపోయినా తెలియని సమాధానాల్ని ఊహించి రాస్తే ఎక్కువగా నష్టమే జరిగే ఆస్కారం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కో తప్పు సమాధానానికి మొత్తం మార్కుల్లో 20 శాతం కోత పెట్టనున్నారు. తెలియని ప్రశ్నలను తేలికగా తీసుకుని వదిలేయడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పోలీస్ శాఖలో 5,400, ప్రత్యేక భద్రతా దళంలో 1,424, అగ్నిమాపక శాఖలో 790, జైళ్ల శాఖలో 223 పోస్టులు ఉన్నాయి. మొత్తం కలిపి 7,437 ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలకు జులై 29న ప్రకటన విడుదలైన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు దాదాపు 28 రోజుల పాటు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లను స్వీకరించారు. అన్ని పోస్టులకు కలిపి 5,77,064 దరఖాస్తులు వచ్చినట్లు బోర్డు ఛైర్మన్ శ్రీనివాస రావు తెలిపారు. దరఖాస్తుదారుల్లో అత్యధికంగా బీసీలు 49.19 శాతం మంది ఉన్నారు. తర్వాతి స్థానంలో ఎస్సీ, ఎస్టీలు 43.60 శాతం మంది ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకున్న 3.45 శాతంతో కలిపి ఓసీల సంఖ్య కేవలం 7.20 శాతంగా ఉంది. అభ్యర్థుల్లో 74.66 శాతం మంది పురుషులు ఉండగా, 25.33 శాతం మంది మహిళలు ఉన్నారు.

# అనుమానాస్పద స్థితిలో నర్సింగ్ విద్యార్థిని మృతి

**ప్రేమను ఒప్పుకోనందుకు అతడే చంపేశాడా**

**బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని తన ఇంటి ఆవరణలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది**

**అనారోగ్యం కారణంగా ఇంటికి వచ్చిన విద్యార్థిని ఇంటి వెనక భాగంలో విగతజీవిగా పడి ఉండటం కలకలం రేపింది.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో నర్సింగ్ విద్యార్థిని హరిణి అనుమానాస్పద మృతి ఘటన కలకలం రేపుతోంది. పట్టపగలు తన ఇంటివెనకే యువతి దారుణ స్థితిలో మృతి చెందింది. శరీరంపై బలమైన గాయాలుండటం చూసి హత్య చేసినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. ఇదే జిల్లా ములకపల్లికి చెందిన ఆదివాసీ నర్సింగ్ విద్యార్థి శిరీష హత్యకు గురై నెల రోజులు గడవక ముందే మరో దళిత యువతిని హత్య చేయడం సంచలనంగా మారింది. వరుస హత్యల పట్ల ఆదివాసీ, దళిత సంఘాలు, రాజకీయ పక్షాల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుకు చెందిన ఇంద్రవెల్లి సతీశ్, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. సతీశ్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబ బాధ్యతలు తల్లిపైనే పడ్డాయి. పెద్ద కుమార్తె హరిణి ఇంటర్ పూర్తి చేసి ఖమ్మం జిల్లా తనికెళ్ల సమీపంలోని ఓ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఫస్టియర్ చదువుతోంది. చిన్న కుమార్తె అన్విత గురుకులంలో ఏడో తరగతి చదువుతోంది. ఇద్దరు పిల్లల చదువుల కోసం తల్లి మిషన్ కుట్టు పని, కూలీ పనులకు వెళ్తోంది. నర్సింగ్ చదువుతున్న హరిణి అనారోగ్యం కారణంగా 20 రోజుల క్రితం కాలేజీ నుంచి కొత్తగూడెంలో ఉంటున్న పిన్ని ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి 3 రోజుల క్రితం వెంగన్నపాలెంలోని తల్లి వద్దకు వచ్చింది. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటల సమయంలో తల్లి రాజేశ్వరి బయటకు వెళ్లింది. గంట తర్వాత ఇంటికి రాగా కుమార్తె హరిణి కనిపించలేదు. ఇంటి ఆవరణలో వెతకగా బాత్‌రూం దగ్గరలోని చెత్తలో మృతదేహం కనిపించింది. విగతజీవిగా ఉన్న కుమార్తెను చూసి తల్లి కన్నీరుమున్నీరవుతోంది. హరిణిది కచ్చితంగా హత్యగానే బంధువులు, కుటుంబసభ్యులు బలంగా చెప్పడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆ గ్రామానికి చెందిన ఓ యువకుడు కొన్నాళ్లుగా పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తున్నాడని, యువతి నిరాకరించడంతోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానం వ్యక్తం చేస్తున్న యువకుడు సైతం పరారీలో ఉండటంతో అతడే హత్య చేసి ఉంటాడా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నా పెద్ద కుమార్తె బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. జ్వరం రావడంతో గురుకులం నుంచి ఇంటికి వచ్చింది. నేను 3 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాను. గంట తర్వాత ఇంటికి వచ్చాక నా బిడ్డ హరిణి కనిపించలేదు. ఇంటి చుట్టూ వెతికితే చెత్తకుప్పలో శవం



దొరికింది. హరిణి మృతదేహం శవపరీక్షకు కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పలు రాజకీయ పక్షాలు, దళిత సంఘాలు, మహిళా సంఘాలు భారీగా అక్కడకు చేరుకున్నాయి. జిల్లాలో వరుస హత్యల పట్ల నిరసనలు వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శవపరీక్ష అనంతరం జూలూరుపాడులో మృతదేహంతో దళిత సంఘాలు, బంధువులు రాస్తారోకోకు దిగారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళనకారుల వద్దకు చేరుకుని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

# తీరం దాటిన తీవ్ర వాయుగుండం

**తెలుగురాష్ట్రాలకు భారీ వర్ష సూచన**

**శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర వాయుగుండం తీరం దాటింది**

**తీరం దాటినా భూభాగంపై తీవ్రవాయుగుండంగానే కొనసాగుతోంది**

**ఈ ప్రభావంతో తెలుగురాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది**



బంగాళాఖాతం తీరంవైపు దూసుకొచ్చిన తీవ్ర వాయుగుండం ఎట్టకేలకు తీరం దాటింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత తీవ్ర వాయుగుండం తీరాన్ని తాకింది. కొన్ని గంటలపాటు తీరందాటే ప్రక్రియ కొనసాగింది. ఇవాళ తెల్లవారుజామున శ్రీకాకుళం జిల్లాలోని కళింగపట్నానికి నైరుతి దిశలో తీరం దాటింది. అయితే తీరం దాటినా భూభాగంపై తీవ్రవాయుగుండంగానే కొనసాగుతోంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తీర ప్రాంతాల్లో సముద్ర అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారులను సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అత్యవసర సహాయ చర్యల కోసం విశాఖ, అల్లూరి, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో 5 ఎస్డీఆర్ఎఫ్, 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. తీవ్ర వాయుగుండం దృష్ట్యా విపత్తుల సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ 112, 1070, 1800-425-0101 టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# నిశ్శబ్దంగా వ్యాపిస్తోన్న హెచ్1ఎన్1 వైరస్

**జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్స్**

**తెలంగాణలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి**

**ప్రధానంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది**

**దీంతో వైరస్ పట్ల వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.**



రాష్ట్రంలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ చాప కింద నీరులా వ్యాపిస్తోంది. హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి కేసుల తాకిడి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీని ద్వారా చాలా మంది ఇబ్బందికి గురికాకపోయినప్పటికీ కొందరిలో తీవ్ర న్యుమోనియాకు దారితీస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్‌లో ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఇటీవల ఈ వైరస్ కారణంగా ఒక రోగి మరణించినట్లు సమాచారం. అయితే వైద్యారోగ్య శాఖ మాత్రం దీన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. ఢిల్లీ, కర్ణాటక వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో హెచ్1ఎన్1 వైరస్ కేసుల సంఖ్య తక్కువగా ఉంది. అయినప్పటికీ ఈ వైరస్ సులభంగా వ్యాపిస్తుందని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇన్‌ఫ్లుయెంజా సోకిన వ్యక్తి దగ్గినా లేదా తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. అందుకే తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యమని, మాస్క్ ధరించడం ఉత్తమమని డాక్టర్లు చెబుతున్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తులు లేదా గుండె సంబంధిత సమస్యల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉన్నవారు ఫ్లూ బారినపడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అయితే ఫ్లూ సోకిన ప్రతి ఒక్కరికీ యాంటీవైరల్ మందులు అవసరం లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. తీవ్రమైన లక్షణాలు ఉన్నవారు మాత్రమే యాంటీవైరల్ మందులను వాడాలని చెబుతున్నారు. అదీ కూడా వైద్యుల సలహా మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన 48 గంటల్లోపు ఈ మందులను వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయంటున్నారు.

# తిరుపతి వేదికగా అఖిల భారత డీజీపీల సదస్సు

**హాజరుకానున్న ప్రధాని మోదీ, అమిత్ షా**

**డిసెంబర్‌లో తిరుపతి వేదికగా 61వ అఖిల భారత డీజీపీల సదస్సు**

**హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

**పాల్గొననున్న దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలు**

**తిరుపతి ఐసర్ క్యాంపస్‌లో ఈ కీలక సమావేశం**



ప్రతిష్ఠాత్మక 61వ అఖిల భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ల సదస్సుకు తిరుపతి జిల్లా ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. జాతీయ భద్రత, పోలీసు వ్యవస్థ పనితీరు వంటి కీలక అంశాలపై చర్చించే ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్) ప్రాంగణం ఈ సదస్సుకు వేదిక కానుంది. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కూడా పాల్గొంటారు. ఈ సదస్సులో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలు, కేంద్ర నిఘా సంస్థల అధిపతులు పాల్గొని దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా సుమారు 400 మంది ఐపీఎస్ అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. జాతీయ స్థాయిలో ఇంతటి కీలకమైన సమావేశం ఏపీలోని తిరుపతిలో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అమరావతిలో ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 'ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్' కార్యాలయాన్ని కేటాయిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పేరుతో గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు కోసం 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025' కింద గతంలో జారీ చేసిన నోటిఫికేషన్లలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. పాత జాబితాలో 8వ సీరియల్ నంబర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అక్కడి నుంచి తొలగించి, కొత్తగా 17వ సీరియల్ నంబర్‌లో "ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, అమరావతి" పేరుతో చేర్చారు. ఈ కార్యాలయం పరిధిలోకి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వస్తుంది. ఈ కొత్త ఎఫ్ఆర్ఆర్వో ఆఫీస్ ద్వారా రాష్ట్రానికి వచ్చే విదేశీయుల నమోదు, వారి వీసాల పొడిగింపు, వీసా మార్పిడులు, ఇతర ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా రాష్ట్రానికి పర్యటనలు, పనుల నిమిత్తం వచ్చే విదేశీ ప్రతినిధులు, అధికారులకు ఈ కార్యాలయం ఏర్పాటు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది.

# డాక్టర్లు ఆపరేషన్ థియేటర్‌లోకి వెనక్కి నడుస్తూ ఎందుకు వెళ్తారు




**అసలు కారణం తెలిస్తే ఆశ్చర్యపోతారు!**

**వెనక్కి నడుస్తూ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లే వైద్యులు**

**గౌన్ ముందు భాగాన్ని స్టైరైల్‌గా ఉంచుకోవడమే ప్రధాన లక్ష్యం**

**గౌన్ వెనుక భాగం స్టైరైల్‌గా ఉండదని వివరణ**

**తలుపులకు గౌన్ తగలకుండా ఉండేందుకు వెనక్కి నడక**

**స్టైరైల్ చేతులతో తలుపు హ్యాండిల్స్‌నూ తాకని వైనం**

ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్తున్నప్పుడు కొందరు సర్జన్లు వెనక్కి నడుస్తూ వెళ్లడం చూసి ఉంటారు. చూస్తే కాస్త విచిత్రంగా అనిపిస్తుంది. 'ఇలా ఎందుకు వెళ్తున్నారు?' అనే సందేహం కూడా రావచ్చు. కానీ దీని వెనుక ఓ ముఖ్యమైన కారణం ఉంది. ఆపరేషన్ సమయంలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండేందుకు పాటించే స్టైరైల్ పద్ధతుల్లో ఇదీ ఒక భాగం. సర్జన్ గౌన్ వేసుకున్న తర్వాత ఏ భాగం శుభ్రంగా ఉండాలి? ఏ భాగాన్ని స్టైరైల్‌గా పరిగణించరు? అనే దానిపై కఠినమైన నియమాలు ఉంటాయి.

### గౌన్ ముందు భాగం చాలా కీలకం

ఆపరేషన్‌కు ముందు సర్జన్ చేతులను పూర్తిగా శుభ్రం చేసుకుని స్టైరైల్ గౌన్, గ్లౌవ్స్ ధరిస్తారు. ఆ తర్వాత గౌన్ ముందు భాగం, చేతుల భాగం, గ్లౌవ్స్‌ను స్టైరైల్‌గా పరిగణిస్తారు. గౌన్ వెనుక భాగాన్ని మాత్రం స్టైరైల్‌గా చూడరు. అందుకే స్టైరైల్ అయిన ముందు భాగం బయట ఉన్న తలుపులు, గోడలు లేదా ఇతర వస్తువులకు తగలకుండా జాగ్రత్త పడాలి.

### అందుకే వెనక్కి నడుస్తారు

సర్జన్ సాధారణంగా ముందుకు నడుస్తూ తలుపు దాటితే.. గౌన్ ముందు భాగం తలుపు లేదా తలుపు ఫ్రేమ్‌కు తగిలే అవకాశం ఉంటుంది. అలా జరిగితే స్టైరైల్ భాగం కలుషితం కావచ్చు. ఈ సమస్యను నివారించేందుకు కొన్ని సందర్భాల్లో సర్జన్లు వెనక్కి తిరిగి నడుస్తూ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్తారు. ఇలా చేయడం వల్ల గౌన్ ముందు భాగం బయట ఉన్న వస్తువులకు తగలకుండా ఉంటుంది.

### వెనుక నుంచి సిబ్బంది సాయం

గౌన్, గ్లౌవ్స్ వేసుకునే సమయంలో కూడా సర్జన్‌కు నర్సింగ్ సిబ్బంది వెనుక నుంచి సాయం చేస్తారు. ఈ విధానం వల్ల సర్జన్ స్టైరైల్ అయిన చేతులు, గౌన్ భాగాలను ఇతరులు తాకాల్సిన అవసరం ఉండదు. ఆపరేషన్ ప్రారంభానికి ముందే స్టైరైల్ విధానాన్ని కాపాడేందుకు ఈ జాగ్రత్తలు తీసుకుంటారు.

### తలుపు కూడా చేతితో తాకరు!

స్టైరైల్ గ్లౌవ్స్ వేసుకున్న చేతులతో సాధారణ తలుపు హ్యాండిల్స్‌ను తాకకూడదు. అవి కలుషితంగా ఉండే అవకాశం ఉంటుంది. అందుకే ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరవడానికి కొన్ని సందర్భాల్లో వీపు, నడుము లేదా భుజాన్ని ఉపయోగిస్తారు. ఇలా చేయడం వల్ల చేతుల స్టెరిలిటీ దెబ్బతినకుండా చూసుకుంటారు.

### అసలు ఉద్దేశం ఇన్ఫెక్షన్‌ను తగ్గించడమే

ఆపరేషన్ థియేటర్‌లో ప్రతి చిన్న కదలిక వెనుక ఇన్ఫెక్షన్ నియంత్రణే ప్రధాన ఉద్దేశం. గౌన్, గ్లౌవ్స్ ధరించడం నుంచి స్టైరైల్ ప్రాంతాల్లో కదలడం వరకు ప్రతి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. వీటి లక్ష్యం బ్యాక్టీరియా లేదా ఇతర కలుషిత పదార్థాలు ఆపరేషన్ ప్రాంతానికి చేరకుండా చూడడం. అందుకే సర్జన్లు వెనక్కి నడవడం వింత అలవాటు కాదు.. రోగి భద్రత కోసం పాటించే జాగ్రత్తల్లో ఒకటి.

# రోజూ నెయ్యి.. గుండెకు మంచిదా? చెడ్డదా? అసలు నిజం ఇదే!

**నెయ్యిలో శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువ**

**మోతాదుకు మించి తీసుకోవడం మంచిది కాదంటున్న నిపుణులు**

**అధిక శాచురేటెడ్ ఫ్యాట్స్‌తో కొలెస్ట్రాల్‌ను పెరిగే ఛాన్స్**

**కొలెస్ట్రాల్ పెరిగితే గుండె జబ్బుల ముప్పు పెరగొచ్చని హెచ్చరిక**

**ఆరోగ్యవంతులు రోజుకు 1-2 టీస్పూన్లు తీసుకోవచ్చని సూచన**



వేడి వేడి అన్నంలో ఓ చెంచా నెయ్యి.. పప్పులో కాస్త నెయ్యి.. రోటీపై మరికాస్త నెయ్యి! ఇలా భారతీయ వంటింట్లో నెయ్యికి ఉన్న ప్రత్యేకతే వేరు. పెద్దలు దీన్ని ఆరోగ్యానికి చాలా మంచిదంటుంటారు. పిల్లలకు పెడితే బలమంటారు. రుచికి కూడా తిరుగుండదు. అయితే ఇంతగా ఇష్టపడే నెయ్యిని మోతాదుకు మించి తీసుకుంటే గుండె ఆరోగ్యంపై ప్రభావం పడుతుందా? వైద్య నిపుణులు ఏమంటున్నారో చూద్దాం..

### మోతాదే అసలు విషయం

నెయ్యిలో శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. 100 గ్రాముల నెయ్యిలో దాదాపు 883 కిలోకేలరీలు ఉంటాయి. అందుకే నెయ్యి తినడం వల్ల సమస్య వస్తుందని కాదు. ఎంత మోతాదులో తీసుకుంటున్నామన్నదే ముఖ్యం.పప్పుకు ఓ చెంచా.. అన్నానికి మరో చెంచా.. రోటీకి ఇంకో చెంచా. ఇలా రోజంతా తెలియకుండానే నెయ్యి పరిమాణం పెరిగిపోవచ్చు. అదే అలవాటు కొనసాగితే శరీరంలోకి అవసరానికి మించిన కొవ్వు చేరుతుంది.

### గుండెపై ఎలా ప్రభావం?

శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ ఎక్కువ కాలం అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఇది గుండె జబ్బుల ముప్పును పెంచొచ్చు.భారతీయుల్లో బయటకు సన్నగా కనిపించినా శరీరంలో కొవ్వు పేరుకుపోయే విధానం భిన్నంగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఆహారంలో కొవ్వుల పరిమాణంపై మరింత శ్రద్ధ అవసరం.

### రోజుకు ఎంత నెయ్యి?

ఆరోగ్యంగా ఉన్న పెద్దలు రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్ల నెయ్యిని మితంగా తీసుకోవచ్చు. అయితే నెయ్యితో పాటు వంట నూనెలు, వెన్న వంటి అన్ని కొవ్వుల పరిమాణాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి.ఇప్పటికే గుండె జబ్బులు, మధుమేహం లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు నెయ్యి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వారి ఆహారంలో కొవ్వుల పరిమాణాన్ని వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సూచన మేరకు నిర్ణయించుకోవడం మంచిది.

### చెంచాతో కొలిస్తే చాలు

నెయ్యిని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. వంటలో అంచనా వేసి పోయడం కాకుండా చెంచాతో మోతాదు చూసుకుని వాడటం అలవాటు చేసుకోవాలి. వంట చివర్లో కొద్దిగా నెయ్యి వేసినా మంచి రుచి, వాసన వస్తాయి.

# కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్నారా

**ఈ చిట్కాలు పాటిస్తే మేలంటున్న నిపుణులు!**

**వంటింటి పదార్థాలతో "కొలెస్ట్రాల్" నియంత్రణ**

**గుండె ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయట**



రక్తనాళాల్లో పూడికల్ని పోగేసి, చివరికి గుండెపోటు, స్ట్రోక్‌ను తెచ్చిపెట్టే కొలెస్ట్రాల్ అంటే అందరికీ భయమే. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి మన ఆహారపు అలవాట్లతో పాటు జీవనశైలి, ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం వంటివి కూడా కొలెస్ట్రాల్ పెరగడానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉండటానికి కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

**ధనియాలు :** ధనియాలను వంటల్లోనే కాకుండా వైద్యంలో కూడా విస్తృతంగా ఉపయోగిస్తారు. ధనియాల నీరు లేదా వాటి సారం, శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. ధనియాలలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి శరీరంలోని కొవ్వును కరిగించడానికి, గుండెను రక్షించడానికి తోడ్పడతాయని చెబుతున్నారు. వీటిని వంటల్లో లేదా కూరల్లో వాడుకోవడమే కాకుండా, ఉదయాన్నే ధనియాల నీటిని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నారు. ఈ సులభమైన ఇంటి చిట్కా కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుందని పేర్కొంటున్నారు.

**అవిసె గింజలు :** గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పోషకాలు అవిసె గింజలలో పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు.. ముఖ్యంగా ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం (ఘాఘా) రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ాణా) స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయని అంటున్నారు. అందువల్ల వీటిని తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా గుండె గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని వెల్లడిస్తున్నారు.కరిగే పీచు పదార్థం పేగులలో కొలెస్ట్రాల్ శోషణను తగ్గిస్తుందంటున్నారు నిపుణులు. అలాగే ఘాఘా వాపును తగ్గించి రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. పొడి చేసిన అవిసె గింజలు లేదా అవిసె నూనె వాడటం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుందని పలు పరిశోధనల్లో తేలింది. ఈ క్రమంలో రోజువారీ ఆహారంలో స్మూతీలు, తృణధాన్యాలు లేదా బేక్ చేసిన పదార్థాలలో అవిసె గింజలను చేర్చుకోవాలని సూచిస్తున్నారు.

**ద్రాక్ష గింజల సారం :** ద్రాక్ష గింజల సారంలో 'పాలీఫెనాల్స్' అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రక్తనాళాలను సంరక్షించడమే కాకుండా గుండెకు చేదోడుగా నిలుస్తాయంటున్నారు. ద్రాక్ష గింజల సారం మొత్తం కొలెస్ట్రాల్‌ను, ాణా ను తగ్గించగలదని చీఫ్‌అశీఖుశ్రీ రాఅఎతీఘుతీఎ శీట వీవఎఅఎఅవ అధ్యయనం పేర్కొంది. ఆపిల్స్, ద్రాక్ష, స్ట్రాబెర్రీలు, సిట్రస్ పండ్లు పండ్లలో పెక్టిన్ పుష్కలంగా ఉంటుంది, ఇది ాణా తగ్గించే ఒక రకమైన కరిగే ఫైబర్ అని ఝతీఝతీఎ ఎముశ్రీష్ట్ర రాబఎశ్రీఅంష్ట్రఅఅస్త్ర అధ్యయనం పేర్కొంది.అంతేకాకుండా, ఇది రక్తనాళాలను మరింత దృఢంగా మారుస్తుందంటున్నారు నిపుణులు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ శక్తి కొలెస్ట్రాల్ ఆక్సీకరణను తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. దీనివల్ల ధమనులు దెబ్బతినకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. ద్రాక్ష గింజల సారానికి సంబంధించిన సప్లిమెంట్లను తీసుకునే వారిలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడమే కాకుండా, గుండె ఆరోగ్య సూచికలు మెరుగుపడినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

**గ్రీన్ టీ :** గ్రీన్ టీలో 'కాటెచిన్స్' (ఝవఎష్ట్రఅఅం) అనే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి ాణాను, మొత్తం కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయంటున్నారు. క్రమం తప్పకుండా గ్రీన్ టీ తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు మెరుగుపడతాయని, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా, ప్రతిరోజూ చక్కెర కలపని కొన్ని కప్పుల గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుందట.

**దాల్చిన చెక్క :** దాల్చిన చెక్క అనేది ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఉపయోగించే ఒక సుగంధ ద్రవ్యం. దీని సువాసనతోపాటు, దాల్చిన చెక్క కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. ఇది మొత్తం కొలెస్ట్రాల్, ాణా, ట్రైగ్లిజరైడ్లను తగ్గించడంలో తోడ్పడుతుందంటున్నారు నిపుణులు. ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకున్నప్పుడు, దాల్చిన చెక్క ఎణా స్థాయిలను మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుందంటున్నారు నిపుణులు. దీనికి కారణం దాల్చిన చెక్కలో ఉండే పాలీఫెనాల్స్ కారణమట. ఇవి యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేసి గుండె జబ్బులకు దారితీసే వాపు, కణాల నష్టాన్ని అరికట్టడంలో సహాయపడతాయని చెబుతున్నారు. అయితే, ఏదైనా ఆరోగ్య మార్పుల కోసం దాల్చిన చెక్కను ఆహారంలో చేర్చుకునే ముందు డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు.

**పసుపు :** పసుపు ప్రతిరోజూ పసుపు లేదా కర్కుమిన్ తీసుకోవడం వల్ల మొత్తం కొలెస్ట్రాల్, ాణా తగ్గుతాయని చీఫ్‌అశీఖుశ్రీ రాఅఎతీఘుతీఎ శీట వీవఎఅఎఅవ అధ్యయనం పేర్కొంది. పసుపును రోజువారీ ఆహారంలో చేర్చుకోవచ్చు లేదా పాలు, టీ వంటి వాటిలో కలిపి తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే, పసుపు సప్లిమెంట్లను మాత్రం కేవలం డాక్టర్ల పర్యవేక్షణలోనే తీసుకోవాలని సూచిస్తున్నారు.

**పచ్చి వెల్లుల్లి :** ప్రతిరోజూ వెల్లుల్లి తీసుకోవడం వల్ల మొత్తం కొలెస్ట్రాల్, ాణా తగ్గుతుందని చీఫ్‌అశీఖుశ్రీ రాఅఎతీఘుతీఎ శీట వీవఎఅఎఅవ అధ్యయనం పేర్కొంది. ఈ తగ్గుదల గుండె సమస్యలు, స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపింది. ఈ క్రమంలో కొలెస్ట్రాల్‌ను సమతుల్యంగా ఉంచుకోవడానికి వెల్లుల్లిని ఆహారంగా తీసుకోవడం లేదా సప్లిమెంట్ల రూపంలో వాడటం ఒక సులభమైన మార్గమంటున్నారు నిపుణులు. వెల్లుల్లిని తాలింపుల్లో లేదా పచ్చడి రూపంలో వంటలకు సులభంగా జోడించవచ్చని చెబుతున్నారు. ఒకవేళ మీరు దీనిని పచ్చిగా తినగలిగితే, ఒక వెల్లుల్లి రెబ్బను నలిపి, దానిని తినడానికి ముందు రెండు నిమిషాల పాటు పక్కన పెట్టాలని సూచిస్తున్నారు.

# వాతావరణం మారగానే పిల్లల్లో జ్వరమా

**ఈ 3 ఇన్ఫెక్షన్లపై ఓ కన్నేయండి!**

**వాతావరణ మార్పుల సమయంలో పిల్లల్లో వచ్చే జ్వరాలను తేలికగా తీసుకోవద్దంటున్న నిపుణులు**

**డెంగ్యూ, హెపటైటిస్ ఏ, ఇన్ఫ్లుయెంజా వంటి ఇన్ఫెక్షన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన**

**ప్రతి ఇన్ఫెక్షన్ లక్షణాలు ప్రారంభంలో ఒకేలా ఉన్నా, వాటి ప్రభావం వేర్వేరుగా ఉంటుందని వెల్లడి**

**జ్వరంతో పాటు ప్రమాదకర సంకేతాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచన**

**ముందస్తు గుర్తింపు, సరైన చికిత్సతో తీవ్రమైన అనారోగ్యాలను నివారించవచ్చంటున్న నిపుణులు**



వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు, ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభంలో పిల్లలకు జ్వరం రావడం సర్వసాధారణం. అయితే, ఇలాంటి జ్వరాలన్నీ సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్లు కావని, వాటిని తేలికగా తీసుకోకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మూడు రకాల తీవ్రమైన ఇన్ఫెక్షన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అవే డెంగ్యూ, హెపటైటిస్ ఏ, ఇన్ఫ్లుయెంజా (ఫ్లూ). ఈ మూడు వ్యాధులు కూడా జ్వరంతోనే ప్రారంభమైనప్పటికీ, వాటి లక్షణాలు, కలిగే నష్టాలు వేర్వేరుగా ఉంటాయని చెబుతున్నారు.

### డెంగ్యూ: జ్వరం తగ్గాకే అసలు ప్రమాదం

డెంగ్యూ సాధారణంగా అకస్మాత్తుగా అధిక జ్వరంతో మొదలవుతుంది. దీనితో పాటు తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, కళ్ల వెనుక నొప్పి, కీళ్ల నొప్పులు, దగ్గు లేదా చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరు పిల్లలలో చర్మంపై ఎర్రటి మచ్చలు, శరీరం కమిలినట్లుగా మారడం, ముక్కు లేదా చిగుళ్ల నుంచి రక్తస్రావం వంటి తేలికపాటి రక్తస్రావ సంకేతాలు కూడా ఉండవచ్చు.అయితే, డెంగ్యూలో అత్యంత ప్రమాదకరమైన దశ జ్వరం తగ్గడం ప్రారంభమైనప్పుడు మొదలవుతుంది. సాధారణంగా వ్యాధి లక్షణాలు కనిపించిన 3 నుంచి 7 రోజుల తర్వాత ఈ దశ వస్తుంది. ఈ సమయంలో నిరంతర వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పి, రక్తస్రావం, చర్మం పాలిపోవడం లేదా చల్లబడటం, వేగంగా శ్వాస తీసుకోవడం, తీవ్రమైన అలసట లేదా చికాకు వంటి ప్రమాద సంకేతాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

### హెపటైటిస్ ఏ: నీటి ద్వారా వ్యాపించే కాలేయ వ్యాధి

హెపటైటిస్ ఏ నీటి ద్వారా వ్యాపించే ఇన్ఫెక్షన్. ఇది కాలేయంపై ప్రభావం చూపుతుంది. ప్రారంభంలో ఇది సాధారణ కడుపు సంబంధిత అనారోగ్యంలా కనిపిస్తుంది. జ్వరం, అలసట, ఆకలి లేకపోవడం, వికారం, కడుపులో అసౌకర్యం వంటి లక్షణాలు ఉంటాయి. ఆ తర్వాత మూత్రం ముదురు రంగులోకి మారడం, పచ్చకామెర్లు (జాండిస్) రావడం జరుగుతుంది. పచ్చకామెర్ల వల్ల చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారుతాయి. హెపటైటిస్ ఏ అనుమానం వస్తే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి. చాలా మంది పిల్లలు సరైన విశ్రాంతి, తగినన్ని ద్రవాలు, పోషకాహారం తీసుకోవడం ద్వారా పూర్తిగా కోలుకుంటారు.

### ఇన్ఫ్లుయెంజా (ఫ్లూ): తీవ్రమయ్యే ప్రమాదం ఉంది

ఇన్ఫ్లుయెంజా లేదా ఫ్లూ కూడా అకస్మాత్తుగా మొదలవుతుంది. జ్వరం, చలి, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, దగ్గు, తీవ్రమైన నీరసం దీని ప్రధాన లక్షణాలు. చిన్న పిల్లలలో వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి కూడా కనిపించవచ్చు. చాలా మంది పిల్లలు పూర్తిగా కోలుకున్నప్పటికీ, కొందరిలో ఇది తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా చిన్న పిల్లలలో న్యుమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, డీహైడ్రేషన్ లేదా జ్వరంతో ఫిట్స్ (మూర్ఛ) వచ్చే ప్రమాదం ఉంటుంది.

### తల్లిదండ్రులకు కీలక సూచన

ఈ మూడు ఇన్ఫెక్షన్ల ప్రారంభ లక్షణాలు దాదాపు ఒకేలా ఉండటంతో తేడాలను గుర్తించడం కష్టమవుతుంది. అందువల్ల, పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు దానిని తేలికగా తీసుకోకుండా, జ్వరంతో పాటు కనిపించే ఇతర లక్షణాలను నిశితంగా గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. జ్వరం తగ్గకపోయినా, తీవ్రమైనా లేదా పైన పేర్కొన్న ప్రమాద సంకేతాలలో ఏవి కనిపించినా వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. వ్యాధిని ముందుగా గుర్తించి, సరైన చికిత్స అందించడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు తాగితే మీ లైఫ్‌లో సరికొత్త చాప్టర్ మొదలైనట్లే



గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మన ఆరోగ్యంలో అనేక మార్పులు వస్తాయట. ఆయుర్వేదం నుంచి సైన్స్ వరకు ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరమని చెబుతుంది. కాబట్టి ఉదయం నిద్రలేచిన తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయో ఇక్కడ తెలుసుకుందాం..

**ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగాలని పదేపదే చెబుతుంటారు. నిజంగా.. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగడం ఓ మంచి అలవాటు. అందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఈ విషయాన్ని పదేపదే చెబుతుంటారు. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? అవును. ఉదయం

**జీర్ణవ్యవస్థ బాగుంటుంది**

ఉదయం పూట నిద్ర లేచిన వెంటనే గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. ఇది పేగు కండరాలను కూడా సడలిస్తుంది.

**విషాన్ని తొలగిస్తుంది**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం పూర్తిగా నిర్విషీకరణ చెందుతుంది. ఈ నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి, శరీరాన్ని లోపలి నుంచి శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. కొంతమంది నిమ్మకాయ, తేనె కలిపి తాగుతారు. ఇది నిర్విషీకరణ ప్రక్రియకు మరింత సహాయపడుతుంది.

**ఏపీ పీజీసెట్ 2025 దరఖాస్తు గడువు పెరిగిందోచ్..**

**ఎప్పటి వరకంటే?**

**జీవక్రియను పెంచుతుంది**

మీరు బరువు తగ్గాలనుకుంటే ఉదయం గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. కాబట్టి, కేలరీలు వేగంగా కరుగుతాయి. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుందని వైద్యులు అంటున్నారు. శరీరం చురుగ్గా ఉంటుంది కూడా.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది కండరాలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

**చర్మ కాంతి పెరుగుతుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి మేలు చేస్తుంది. దాని ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. అంతేకాకుండా గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొటిమలు, ముడతలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

**గమనిక:**

ఈ కంటెంట్ సాధారణ సమాచారం కోసం మాత్రమే. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
తెలుగు దిన పత్రిక
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com



# గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రం.. తగ్గనున్న వంట నూనెల ధరలు..!

దేశంలో క్రమంగా ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. అలాగే బియ్యం ధరలు కూడా పెరిగాయి. ఆ మధ్య భారీగా పెరిగిన చక్కెర ధర ఇప్పుడు కాస్త తగ్గుముఖం పట్టింది.అటు వంట నూనెల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పలు వంట నూనెలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని తగ్గించింది. ముడి పామాయిల్, సోయాబీన్ నూనెలపై సుంకాన్ని సగానికి తగ్గించగా, ముడి పొద్దుతిరుగుడు నూనెపై పన్నును పూర్తిగా రద్దు చేసింది. ఈ మార్పుల ప్రకారం ముడి పామాయిల్, ముడి సోయాబీన్ నూనెలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 5 శాతాని తగ్గించినట్లు ప్రకటించింది. ముడి పొద్దుతిరుగుడు నూనెపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి సున్నాకు తగ్గించింది. ప్రభుత్వం శుద్ధి చేసిన వంట నూనెలపై కూడా సుంకాలను తగ్గించింది. శుద్ధి చేసిన పామాయిల్, శుద్ధి చేసిన సోయాబీన్ నూనెలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 32.5 శాతం నుంచి 27.5 శాతానికి చేర్చింది. ఇక శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు నూనెపై సుంకాన్ని 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించింది. 23 సెప్టెంబర్ 2026 నాటి నోటిఫికేషన్ నెం. 31/2026-కస్టమ్స్ ప్రకారం, సవరించిన సుంకాలు సెప్టెంబర్ 24 నుంచి అమల్లోకి వస్తాయి. గత ఏడాది కాలంలో భారతదేశంలో కూరగాయల నూనెల ధరలు దాదాపు 20 శాతం పెరిగిన తరుణంలో ఈ సుంకాల తగ్గించారు. యూపీఐ ఉచితంగా ఉండాలి.. ఛార్జీలు విధిస్తే డిజిటల్ ఇండియాకి అర్థం లేదు.. మాజీ కీలక వ్యాఖ్యలు.. సాధారణంగా డిమాండ్ పెరిగే సెప్టెంబర్-నవంబర్ పండుగల కాలానికి ముందు ఇది ఆందోళనలను పెంచుతోంది. తక్కువ దిగుమతి సుంకాలు దేశీయ వంట నూనెల ధరలను తగ్గించడంలో సహాయపడతాయి. స్వీట్లు, స్నాక్స్, వేయించిన ఆహారాలలో ఉపయోగించే నూనెల వినియోగం పెరగనుంది. ప్రపంచంలోనే కూరగాయల నూనెలను అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశంగా భారత్ ఉంది. ఇండిటయా తన అవసరాలలో దాదాపు మూడింట రెండు వంతుల దిగుమతులు చేసుకుంటుంది. పామాయిల్, సోయాబీన్ నూనె, పొద్దుతిరుగుడు



నూనెలు ఎక్కువగా దిగుమతి చేసుకోంటుంది. భారతదేశానికి వంట నూనెల సరఫరా ప్రధానంగా మలేషియా, ఇండోనేషియా, అర్జెంటీనా, రష్యా, ఉక్రెయిన్ నుంచి వస్తుంది. ఈ తాజా సుంకాల మార్పులు ముఖ్యమైన వంట నూనెలపై దిగుమతి సుంకాల భారాన్ని తగ్గిస్తాయని, పెరిగిన ధరల మధ్య దేశీయ వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగిస్తాయని భావిస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# రాత్రికి రాత్రే కుప్పకూలిన యుఎస్ మార్కెట్.. భోరుమని ఏడ్చేసిన ఇన్వెస్టర్లు.. ఏం జరిగిందంటే..

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో మళ్లీ తీవ్ర అనిశ్చితి నెలకొంది. సెప్టెంబర్ 23, బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమెరికా స్టాక్ సూచీలు భారీ పతనాన్ని చవిచూశాయి. డౌ జోన్స్ ఏకంగా 350 పాయింట్లు నష్టపోయి.. గత సెషన్‌లో సాధించిన లాభాలన్నింటినీ కోల్పోగా, ఎస్‌డపి 500 (ఎస్అండ్‌పీ 500) 0.75 శాతం క్షీణించింది. ఇక సాంకేతిక రంగ కంపెనీలతో కూడిన నాస్‌డాక్ 1.1 శాతం పడిపోయి.. తన ఆల్‌టైమ్ రికార్డు గరిష్ఠ స్థాయిల కంటే దిగువకు చేరింది. యూఎస్ ట్రెజరీ బాండ్ ఈల్డ్స్ ఊహించని రీతిలో రికార్డు స్థాయిలకు పెరగడం, ముడి చమురు ధరలు కనిష్టాల నుండి మళ్లీ పుంజుకోవడం ఈ అమ్మకాల ఒత్తిడికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ముఖ్యంగా, యూఎస్ 10 సంవత్సరాల బాండ్ రాబడి 5.135 శాతానికి చేరుకుంది. ఇది జూలై 2007 తర్వాత నమోదైన అత్యధిక స్థాయి కాగా.. ఏప్రిల్ 7, 2025 తర్వాత ఒక్కరోజులో నమోదైన అతిపెద్ద పెరుగుదలగా నిలిచింది. అలాగే 2 సంవత్సరాల బాండ్ రాబడి 4.947 శాతానికి (మే 2024 తర్వాత గరిష్ఠం), 30 సంవత్సరాల బాండ్ రాబడి దాదాపు 5.4 శాతానికి (జూన్ 2007 తర్వాత గరిష్ఠం) పెరిగాయి. అమెరికా మార్కెట్లలో ఈ దిగ్భ్రాంతికర పతనానికి దారితీసిన నాలుగు ప్రధాన కారణాలు క్రింది విధంగా ఉన్నాయి. 1. ఊహించని రీతిలో బలమైన యూఎస్ ఆర్థిక గణాంకాలు: బాండ్ దిగుబడులు పెరగడానికి ప్రధానంగా అమెరికా ఆర్థిక వ్యవస్థలోని బలమైన వృద్ధి గణాంకాలే కారణమయ్యాయి. సెప్టెంబర్ నెల ఎస్‌డపి గ్లోబల్ సర్వీసెస్ పీఎంఐ 58.7కు పెరిగింది. ఆగస్టులో నమోదైన 56.5 కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం. అంతేకాకుండా మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ 56.7గా నమోదై.. గత నాలుగేళ్లలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. కోవిడ్ అనంతర రికవరీని మినహాయిస్తే, 2015 తర్వాత అమెరికాలో వ్యాపార కార్యకలాపాల్లో నమోదు బలాన్ని ఇది సూచిస్తోంది. అయితే ఆర్థిక వ్యవస్థ అంత వేగంగా పుంజుకోవడం వల్ల ఫెడరల్ రిజర్వ్ మళ్లీ వడ్డీ రేట్లను పెంచుతుందనే భయాలు ఇన్వెస్టర్లలో వ్యక్తమయ్యాయి. స్టాక్ మార్కెట్‌ని కుప్పకూల్చిన ఒక్క మెసేజ్.. చివరి 20 నిమిషాల్లోనే షేర్ మార్కెట్ భారీ పతనం.. 2. ఫెడ్ గవర్నర్ వడ్డీ రేట్ల హెచ్చరిక: ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ మైఖేల్ బార్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్ ఒత్తిడిని మరింత పెంచాయి. ద్రవ్యోల్బణాన్ని ఆశించిన స్థాయికి తగ్గించడానికి మరియు ధరల స్థిరత్వాన్ని కాపాడటానికి మరిన్ని విధానపరమైన వడ్డీ రేట్ల పెంపు అవసరమని ఆయన సూచించారు. దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలకు మరియు ఉపాధి అవకాశాలకు స్థిరమైన ధరలే కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే, అక్టోబర్ 28న




జరగబోయే సమీక్షలో ఫెడరల్ రిజర్వ్ మరో 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటును పెంచే సంభావ్యత 55.4 శాతం నుండి ఏకంగా 70 శాతానికి పెరిగిందని ఫెడ్‌వాచ్ టూల్ వెల్లడించింది. 3. ఐదేళ్ల యూఎస్ బాండ్ వేలానికి క్షీణించిన డిమాండ్: బుధవారం జరిగిన ఐదేళ్ల యూఎస్ ట్రెజరీ నోట్ల వేలంలో ఇన్వెస్టర్ల డిమాండ్ చాలా బలహీనంగా నమోదైంది. ఈ అమ్మకాలు 5.033 శాతం దిగుబడితో ముగిశాయి. గత ఆరు వేలాలలో నమోదైన సగటు దిగుబడి 4.186 శాతంతో పోలిస్తే ఇది గణనీయంగా ఎక్కువ. సెంట్రల్ బ్యాంకులు మరియు పరోక్ష బిడ్డర్లు కూడా తమ సాధారణ కొనుగోలు పరిమాణం కంటే చాలా తక్కువ పరిమాణంలో పాల్గొనడం, బాండ్ మార్కెట్లో నిధుల కొరతను సూచిస్తూ ఈల్డ్స్‌ను మరింత పెంచింది. 4. చమురు ధరల పెరుగుదల, జియో-పొలిటికల్ ఉద్రిక్తతలు: తక్కువ స్థాయిలలో ఉన్న ముడి చమురు ధరలు మళ్లీ పుంజుకోవడం కూడా వడ్డీ రేట్ల అంచనాలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ప్రసంగం తర్వాత అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో అస్థిరత ఏర్పడింది. అలాగే, అమెరికా నుంచి డీజిల్ ఎగుమతులపై సంభావ్య నిషేధం విధించవచ్చనే ఆందోళనలు కూడా సరఫరా లభ్యతను భయా ఎట్టాయి. చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భావనతో బాండ్ దిగుబడులు పెరిగాయి. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్ నిపుణులు, ఇన్వెస్టర్లు అందరూ చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య జరగనున్న భేటీ ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వాషింగ్టన్‌లో షీ జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా బుసాన్ వాణిజ్య ఒప్పందంపై తాత్కాలిక నిలుపుదలను జనవరి 10వ తేదీ వరకు పొడిగించడం మార్కెట్లకు కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పవచ్చు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్.. ముంబైకి బిగ్ షాక్..

# భాగ్య నగరంలో లగ్జరీ ఇళ్ల కోసం ఎగబడుతున్న ఇన్వెస్టర్లు..

తెలంగాణ రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని రీతిలో సరికొత్త వృద్ధి దశలోకి దూసుకెళ్తోంది. నగరంలో మరొక భారీ రియల్ ఎస్టేట్ విజృంభణ నమోదవుతుండటంతో.. హైదరాబాద్ త్వరలోనే దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పోటీపడే స్థాయికి విస్తరిస్తుందని వ్యాపార వర్గాలు, రియల్టర్లు అంచనా వేస్తున్నారు. నైట్ ఫ్రాంక్ నివేదిక ప్రకారం, 2026 నాటికి హైదరాబాద్‌లో సగటు నివాస గృహాల ధర గతేడాదితో పోలిస్తే 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,258కి చేరుకుంది.ముఖ్యంగా నగర పశ్చిమ భాగంలో ఉన్న కోకాపేట్, గచ్చిబౌలి, తెల్లాపూర్ వంటి ప్రాంతాలు ప్రీమియం ప్రాజెక్టులకు కేంద్రబిందువుగా మారుతూ.. హైదరాబాద్‌లోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస మార్కెట్‌గా తమ స్థానాన్ని నిలబెట్టుకున్నాయి. మార్కెట్లో అత్యంత ముఖ్యమైన మార్పు కొనుగోలుదారుల ప్రాధాన్యతల్లో కనిపిస్తోంది. అనారాక్ నివేదికల ప్రకారం.. హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే మొత్తం గృహాలలో రూ. 2.5 కోట్లకు పైబడిన ప్రీమియం ఇళ్ల వాటా 35 శాతానికి చేరింది. గత ఏడాది నమోదైన 18 శాతంతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు వృద్ధిని ప్రతిబింబిస్తోంది. అంతేకాకుండా, రూ. 10 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన అతి విలాసవంతమైన ఇళ్ల మార్కెట్‌లో హైదరాబాద్ కొత్త సరిహద్దులను సృష్టించింది. ఇండియా సోతేబీస్ ఇంటర్నేషనల్ రియల్టీ నివేదిక ప్రకారం..2026లో ఏకంగా 625 ఆల్ట్రా లగ్జరీ ఇళ్లు రూ. 8,562 కోట్ల విలువతో అమ్ముడయ్యాయి. దీనితో దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఖరీదైన, విలాసవంతమైన నివాస మార్కెట్‌గా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. సామాన్యుడికి నో ఎంట్రీ.. రాయదుర్గంలో ఎకరా భూమి రూ. 264 కోట్లు పైమాటే.. నగరంలో అసలేం జరుగుతోంది.. ఈ విప్లవాత్మక వృద్ధికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ మరియు వాణిజ్య ఆఫీస్ రంగాలు ప్రధాన ఇంధనంగా పనిచేస్తున్నాయి. 2026 మొదటి అర్ధభాగంలో హైదరాబాద్ సాధించిన 7.5 మిలియన్ చదరపు అడుగుల రికార్డు ఆఫీస్ లీజింగ్‌లో.. దాదాపు 45 శాతం వాటా ఈ జిసిసిలదే కావటం విశేషం. ఉబెర్, ఇన్వెస్కో, లోరియల్ మరియు ఆర్సెలర్ మిత్తల్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తమ కార్యాలయాలను విస్తరించడం వల్ల నగరంలో భారీగా అధిక



ఆదాయ వర్గాల ఉద్యోగాలు పెరిగాయి. ఇది ఒక శక్తివంతమైన ఆర్థిక చక్రాన్ని సృష్టించి, ఆఫీస్ డిమాండ్ ద్వారా ఉన్నత శ్రేణి గృహాలకు డిమాండ్‌ను మరింతగా పెంచుతోంది. అయితే భౌగోళిక వ్యత్యాసాల దృష్ట్యా హైదరాబాద్ రాత్రికి రాత్రే ముంబైలా మారకపోవచ్చు. ముంబైలో ఉన్న తీవ్ర భూ పరిమితులు, విపరీతమైన జనసాంద్రత, పాత మౌలిక వసతులతో పోలిస్తే హైదరాబాద్ విస్తృతమైన స్థలం, ఔటర్ రింగ్ రోడ్ మరియు అద్భుతమైన రీజినల్ రింగ్ రోడ్ ప్రణాళికలతో విస్తరణకు అనుకూలంగా ఉంది. అయినప్పటికీ, స్థిరమైన ఉపాధి అవకాశాలు, వేగవంతమైన మౌలిక సదుపాయాల విస్తరణ, ధనవంతుల నుండి పెరుగుతున్న డిమాండ్ వల్ల తదుపరి రియల్ ఎస్టేట్ సైకిల్ నాటికి హైదరాబాద్ దేశంలోనే అత్యంత ఖరీదైన, ప్రత్యేకమైన, అంతర్జాతీయ స్థాయి నగరంగా అవతరించడం ఖాయంగా కనిపిస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు.

# వెస్టిండీస్‌తో సిరీస్‌కు టీమిండియా మేనేజర్‌గా వికాస్ కత్యాల్

**ఈ నెల 27 నుంచి 3 వన్డేలు, 5 టీ20ల సిరీస్ వన్డే జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా ఎంపిక**

**టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వికాస్ నియామకం తమకు గర్వకారణమని డీడీసీఏ ప్రకటన**



వెస్టిండీస్‌తో స్వదేశంలో జరగనున్న సిరీస్‌కు టీమిండియా మేనేజర్‌గా ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) డైరెక్టర్ వికాస్ కత్యాల్ నియమితులయ్యారు. ఈ మేరకు డీడీసీఏ బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కత్యాల్ నియామకం తమ అసోసియేషన్‌తో పాటు ఢిల్లీ క్రికెట్‌కు గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలియజేసింది.ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ఈ పర్యటనలో భాగంగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. తిరువనంతపురంలో జరగనున్న తొలి వన్డేతో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. మిగిలిన వన్డేలకు గువాహటి, న్యూ చండీగఢ్‌లు ఆతిథ్యం ఇవ్వనుండగా.. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు వేదికలుగా టీ20 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.ఈ సిరీస్‌లోని వన్డే జట్టుకు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా వన్డే స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. ఇక టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహిస్తాడు. ఈ జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ వంటి యువ, అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు అవకాశం కల్పించారు.ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య జరిగిన వన్డేల్లో భారత్ 67-63 ఆధిక్యంలో ఉండగా, టీ20ల్లో 19-10 తేడాతో ముందంజలో ఉంది. చివరిసారిగా 2026 టీ20 ప్రపంచకప్‌లో భాగంగా మార్చి 1న ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# ఐపీఎల్ 2027 వేలానికి వేదిక ఖరారు.. ఈసారి ఇండియాలోనే!

**డిసెంబర్‌లో ఐపీఎల్ 2027 ఆటగాళ్ల వేలం వేదికగా గోవాను ఖరారు చేసిన బీసీసీఐ**

**మూడేళ్ల తర్వాత తిరిగి భారత్‌లో వేలం నిర్వహణ భారీ వర్షాల కారణంగా మహిళల క్రికెట్ మ్యాచ్ వేదిక మార్పు**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ వేలంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గోవా వేదికగా ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా బుధవారం స్పష్టం చేశారు. అయితే, వేలానికి సంబంధించిన కచ్చితమైన తేదీలను ఇంకా వెల్లడించాల్సి ఉంది.గత మూడు పర్యాయాలుగా ఐపీఎల్ వేలం విదేశాల్లోనే జరిగింది. అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియా వంటి నగరాలు ఈ వేలానికి వేదికలుగా నిలిచాయి. అయితే, ఈసారి తిరిగి భారత్‌లోనే వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు సైకియా తెలిపారు. “గత మూడుసార్లు వేలాన్ని అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియాలో నిర్వహించాం. ఈసారి డిసెంబర్‌లో గోవాలో నిర్వహించాలని నిర్ణయించాం” అని ఆయన మీడియాకు వివరించారు.ఇదే సందర్భంలో బీసీసీఐ మరో కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. ఇండియా ‘ఏ’, ఆస్ట్రేలియా ‘ఏ’ మహిళా జట్ల మధ్య జరగాల్సిన మల్టీడే మ్యాచ్ వేదికను మార్పు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా, ఈ మ్యాచ్‌ను పంజాబ్‌లోని మొహాలీకి తరలించారు. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనుంది.

# రషీద్ ఖాన్ ఆధిపత్యానికి బ్రేక్.. టీ20లలో కొత్త నంబర్ వన్ బౌలర్ గా పాక్ స్పిన్నర్

**టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరిన అబ్రార్ అహ్మద్**

**ఆరు నెలల రషీద్ ఖాన్ ఆధిపత్యానికి తెరపడింది**

**బ్యాటింగ్ జాబితాలో కెరీర్ బెస్ట్ 4వ ర్యాంక్‌కు ఎగబాకిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్**

**శ్రీలంక సిరీస్‌లో రాణించడంతో ఐదో స్థానానికి చేరిన జోస్ బట్లర్**

**ర్యాంకులు మెరుగుపరుచుకున్న భారత ఆటగాళ్లు శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, బిష్ణోయ్**




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అఫ్గానిస్థాన్ స్పిన్ సంచలనం రషీద్ ఖాన్ ఆరు నెలల సుదీర్ఘ ఆధిపత్యానికి తెరదించుతూ పాకిస్థాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ తొలిసారి బౌలింగ్ చార్టులలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మరోవైపు, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ బ్యాటింగ్ జాబితాలో కెరీర్ బెస్ట్ నాలుగో ర్యాంక్‌కు దూసుకొచ్చాడు.శ్రీలంకతో జరిగిన స్వదేశీ సిరీస్‌లో ఇంగ్లండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో హ్యారీ బ్రూక్ కీలక పాత్ర పోషించాడు. ఈ సిరీస్‌లో మొత్తం 170 పరుగులు చేసిన అతను.. సౌతాంప్టన్‌లో అజేయంగా 114 పరుగులు సాధించి ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరాడు. భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న బ్రూక్.. వన్డే ర్యాంకింగ్స్‌లోనూ 12వ స్థానానికి చేరి, మూడు ఫార్మాట్లలోనూ టాప్-10లోకి ప్రవేశించేందుకు చేరువయ్యాడు.బౌలింగ్ విభాగంలో అనూహ్య మార్పు జరిగింది. ఇటీవల భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో రషీద్ ఖాన్ సాధారణ ప్రదర్శన చేయడంతో అతని రేటింగ్ ఒక పాయింట్ తగ్గింది. దీంతో 736 రేటింగ్ పాయింట్లతో ఉన్న పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్.. రషీద్‌ను వెనక్కి నెట్టి కెరీర్‌లో తొలిసారి నంబర్ వన్ టీ20 బౌలర్‌గా అవతరించాడు. ఉమర్ గుల్, సయీద్ అజ్మల్, ఇమాద్ వసీం, షాహిద్ అఫ్రిది తర్వాత ఈ ఘనత సాధించిన ఐదో పాకిస్థాన్ బౌలర్‌గా అబ్రార్ నిలిచాడు.ఇతర ఆటగాళ్లలో, శ్రీలంకపై 172 పరుగులు చేసిన ఇంగ్లండ్ వికెట్ కీపర్ జోస్ బట్లర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఐదో ర్యాంక్‌కు చేరాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఏడు స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకును అందుకున్నాడు. బౌలింగ్ జాబితాలో ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ ఏకంగా 47 స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకుకు చేరుకోగా, భారత స్పిన్నర్లు అక్షర్ పటేల్ (15వ ర్యాంక్), రవి బిష్ణోయ్ (35వ ర్యాంక్) కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు.వన్డే ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆస్ట్రేలియాపై రాణించి బ్యాటింగ్ జాబితాలో 24వ స్థానానికి, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ బౌలింగ్ జాబితాలో 17వ స్థానానికి చేరుకున్నారు.



## మహేష్ బాబు 'వారణాసి' షూటింగ్ పూర్తి.. ఇక చివరి దశ పనులు జరుపుకుంటున్న రాజమౌళి చిత్రం!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'. గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజమౌళి గత చిత్రాలకు భిన్నంగా మరింత విస్తృతమైన ప్రపంచాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా 'వారణాసి' నిలుస్తోంది. ఈ సినిమా ద్వారా మహేష్ బాబు తొలిసారి రాజమౌళితో కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లోనే కాకుండా సినీ వర్గాల్లోనూ ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథ, పాత్రలు, చిత్రీకరణ, నిర్మాణ విలువలను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించింది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'వారణాసి'లో మహేష్ బాబు చేయాల్సిన షూటింగ్ భాగం పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో ఇక మహేష్ బాబు తన తదుపరి పనులపై దృష్టి పెట్టేందుకు సిద్ధమవుతున్నారనే చర్చ మొదలైంది. అయితే చిత్ర బృందం నుంచి ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాజమౌళి సినిమా అంటే ప్రతి సన్నివేశాన్ని అత్యంత జాగ్రత్తగా తెరకెక్కించడం, అవసరమైన స్థాయిలో భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాలు రూపొందించడం సహజం. అందుకే 'వారణాసి' షూటింగ్ విషయంలోనూ భారీ షెడ్యూల్స్ కొనసాగుతున్నాయి. మహేష్ బాబు తన భాగాన్ని పూర్తి చేసుకున్నా.. మిగిలిన నటీనటులతో కీలక సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణ ప్రకారం 'వారణాసి' ప్రధాన షూటింగ్ అక్టోబర్ మొదటి వారంలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే భారీ స్థాయి నిర్మాణం కావడంతో షూటింగ్ పూర్తయిన తర్వాత కూడా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక పనులకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సినిమా కథ, నేపథ్యం, పాత్రల వివరాలను చిత్ర బృందం పూర్తిగా రహస్యంగా ఉంచుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, టైటిల్‌కు సంబంధించిన సమాచారం సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ముఖ్యంగా మహేష్ బాబు పాత్ర ఎలా ఉండబోతోంది? ప్రియాంక చోప్రా పాత్ర ఏ స్థాయిలో ఉంటుంది? పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతోంది? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

## ప్యారడైజ్.. నిజమైన ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్న నాని



తన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలపై వచ్చిన కోర్టు ఉత్తర్వుల విషయంలో నేచురల్ స్టార్ నాని పూర్తి స్పష్టత ఇచ్చారు. బెంగళూరు కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సృష్టించిన ఫేక్ పోస్టులు, బాట్లకు మాత్రమే వర్తిస్తుందని, నిజమైన ప్రేక్షకుల అభిప్రాయాలకు కాదని తేల్చి చెప్పారు. సినిమా చూసి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే హక్కు ప్రేక్షకులకు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నకిలీ, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నిర్మాత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బెంగళూరు సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 19న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై ముంబైలో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ... కొంతమంది డబ్బులు ఇచ్చి బాట్లతో, ఏఐ టెక్నాలజీతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటం అలాంటి వారిపైనే తప్ప, నిజమైన సినీ ప్రియులపై కాదని ఆయన వివరించారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు తమ విమర్శలను, అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా చెప్పవచ్చని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రేపు (సెప్టెంబర్ 24) 'ది ప్యారడైజ్' విడుదల కానుంది. ఇప్పటికే సెప్టెంబర్ 23 రాత్రి పలు నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



## మనం పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం? ఎయిర్‌పోర్ట్‌లో ధనుశ్‌కు ఊహించని ప్రశ్న, నవ్వుతూ దాటేసిన హీరో!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం 'రాయన్' కు ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. ఈ వేడుకల అనంతరం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పయణమవుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా అక్కడున్న ఒక మీడియా రిపోర్టర్ సరదాగా ధనుష్‌ను ఉద్దేశించి, (మనం రాజకీయ పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం?) అని ప్రశ్నించారు. సీఎం విజయ్ తర్వాత ధనుష్ కూడా పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న వార్తల సందర్భంగా ఈ ప్రశ్నను రిపోర్టర్ అడిగారు. అయితే ఈ ఊహించని ప్రశ్నకు ధనుష్ ఎలాంటి సీరియస్ వ్యాఖ్యానాలు చేయకుండా, కేవలం చిరునవ్వు నవ్వుకుంటూ అక్కడి నుంచి సైలెంట్‌గా వెళ్లిపోయాడు ధనుష్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## అదరగొట్టేసిన రష్మిక మందన్నా.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా మైసా టీజర్ వ్యూస్

కన్నడ భామ రష్మిక మందన్నా తొలిసారి యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్న ప్రాజెక్ట్ మైసా పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుందని తెలిసిందే. ఇక రెండు రోజుల క్రితం లాంచ్ చేసిన టీజర్ రష్మిక మందన్నాలోని మరో యాంగిల్‌ను చూడబోతున్నట్టు చెప్పేస్తుంది. డీగ్లామరైజ్‌డ్‌గా యాక్షన్ అవతార్‌లో గూస్‌బంప్స్ తెప్పించే యాక్టింగ్‌తో అదరగొట్టేస్తుంది. మైసా టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. టీజర్ లాంచ్ చేసిన కొన్ని గంటల్లోనే 25 మిలియన్లకుపైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. రష్మిక మందన్నా ఊహించని లుక్‌లో అదరగొట్టేస్తూ.. విజయశాంతిని గుర్తుకు తెస్తోందంటూ కామెంట్లు పెడుతున్నారు మూవీ లవర్స్. ఈ మూవీలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని టీజర్‌తో తెలిసిపోతుంది. మైసా సినిమాతో ఝుఝఅఅసతీఝ ౹ాబశ్రీశ్రీవ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడు. డెబ్యూ డైరెక్టర్ ఎంట్రీతోనే బాక్సాఫీస్‌ను షేక్ చేయడం పక్కా అని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి.



## రూ. 100 కోట్ల వసూళ్లు.. 'మండాడి' టీమ్‌పై కమల్ హాసన్ ప్రశంసలు!



ప్రముఖ నటుడు సూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'మండాడి' ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల వసూళ్లను రాబట్టి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, లెజెండరీ నటుడు కమల్ హాసన్ ఈ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మత్స్యకారుల జీవితాలు మరియు సంప్రదాయ పడవ రేసుల (పాయ్ మార పడగు) నేపథ్యంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూరితో పాటు సుహాస్ కీలక పాత్రల్లో నటించారు. సెప్టెంబర్ 10న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ. 109.25 కోట్ల ప్రపంచవ్యాప్త వసూళ్లను సాధించింది. అయితే తాజాగా ఈ సినిమాను చూసిన కమల్ హాసన్ చిత్రబృందానికి కలుసుకుని సినిమాపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఇక కమల్ హాసన్‌ను కలవడం తన జీవితంలో మరువలేని క్షణమని హీరో సూరి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. "డాక్టర్ కమల్ హాసన్ సర్, మీ నిస్వార్థమైన ప్రేమ, శక్తివంతమైన మాటలు, దీవెనలు మా మండాడి ప్రయాణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అంటూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు మతిమారన్ పుగళేంది కూడా స్పందిస్తూ, సినిమా రంగంలో సీనియర్ విద్యార్థి, నిరంతరం స్ఫూర్తినిచ్చే కమల్ హాసన్‌ను కలవడం సంతోషంగా ఉందని, తమ చిత్రాన్ని అభినందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రంలో ప్రతినాయక పాత్రలో నటించిన టాలీవుడ్ నటుడు సుహాస్ మాట్లాడుతూ, కొన్ని క్షణాలు మనల్ని నిశ్చేష్టులను చేస్తాయి. నట దిగ్గజం కమల్ హాసన్ సర్ పక్కన నిలబడటం నా కల సాకారమైన క్షణం అంటూ తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040